J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12


THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 9 2.08.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## గత ప్రభుత్వ సిత్రాలంటూ...... బాబు శ్వేతపత్రాలు



### అవన్నీ తెలిసే జనం జగన్‌ని సాగనంపారు

### ఇప్పుడిక.. ప్రజలకు ఆ పత్రాలతో పనిలేదు

## ఆంధ్రాలో... ఏం జరగబోతోంది?

- వచ్చిన వెంటనే సంపద సృష్టిస్తామన్నారు
- గత ప్రభుత్వానికి మించి సొమ్ములు పంచుతామన్నారు
- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు
- బాబు 4.0 పవర్‌ను దేశానికే ఆదర్శంగా నిలుపుతామన్నారు
- లెక్కలు, పద్దులతోనే పొద్దు గడిపేస్తున్నారు

ఆంధ్రప్రదేశ్ తాజా ముఖ్యమంత్రి చంద్రబాబు వరుసగా విడుదల చేస్తున్న శ్వేతపత్రాలను చూసి జనం ఆశ్చర్యపోతున్నారు. ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువగా గత ప్రభుత్వ సిత్రాలు బయటపడుతుండడం ఈ ఆశ్చర్యానికి ఒక కారణమైతే, ఇలా జరిగాయి కాబట్టే కదా జగన్‌ని ఓడించామన్నది మరో కారణం. జగన్ తప్పులు బాబు పరిష్కరిస్తారనే కదా వారికి ఓటేసి గెలిపించింది, మరి వారు లెక్కలు చూపిస్తున్నారే..? ఇందులో ఆంతర్యం ఏమిటన్నది జనం అనుమానం. ఓ వైపు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్సలు బాగోలేదని స్పష్టం చేస్తున్నారు. నిజాలను నిర్భయంగా మాట్లాడేవారి వ్యక్తిత్వం, సత్యనిష్ట గొప్పవే. కాదని ఎవ్వరూ అనరు, అనలేరు కూడా. అయితే, ప్రజలకు తెలిసిన విషయాలనే మళ్లీ మళ్లీ చర్వితచరణంగా చెప్పటం కొత్త అనుమానాలకి తెరలేపుతోంది.

10లో



# రామాయపట్నం పోర్టును త్వరగా నిర్మించండి

## - కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ వేమిరెడ్డి విజ్ఞాపన



రాష్ట్ర వాణిజ్యానికి ఎంతో ఉపయోగ పడే రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని నెల్లూరు పార్ల మెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం లోక్‌సభలో రూల్ నెంబర్ 377 ద్వారా ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టం, 13వ షెడ్యూల్ ప్రకారం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు లను కేంద్రం చేపట్టాలని ఉందని, అం దులో రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ డీప్-సీ పోర్ట్‌ను నిర్మించడం ప్రధానమైందని ఆయన పేర్కొన్నారు. రామాయపట్నం వద్ద రూ. 3,736 కోట్లు వ్యయంతో ఫేజ్-1 ప్రాజెక్ట్ చాలాకాలం క్రితమే పనులు పూర్తి చేయాల్సి ఉందని, అయితే పోర్టులో ఆ పనులు దాదాపుగా నిలిచిపోయాయని వేమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్-1 పనులు పూర్తయితే పోర్టులో 4 బెర్తులు ఏర్పాటయ్యేవని, పోర్ట్‌లో సంవత్సరానికి 34 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం ఉండేదని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ రామాయపట్నం పోర్ట్ పనులను సమీక్షించి, ఫేజ్-1 పనులు పూర్తి చేసేందుకు కృషిచేయాలని వేమిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

### రాష్ట్రానికి..6 స్కిల్ సెంటర్లు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల లోక్‌సభలో నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ (ఎన్ఇఎల్ఎస్) స్కిల్ సెంటర్ల ఏర్పాటుపై పలు ప్రశ్నలు వేశారు. దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో కేంద్ర ప్రభుత్వం 95 నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ స్కిల్ సెంటర్లను మంజూరు చేసిందా?.. అయితే, ఏపీలో కేవలం 6 స్కిల్ సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేశారా, చేస్తే వాటి వివరాలు తెలియజేయాలని కోరారు. అందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ, 2021-26 సంవత్సరాల్లో భౌగోళిక ప్రాతి నిధ్యం, జనాభాను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా 120 ఎన్ఇఎల్ఎస్ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణ యించినట్లు చెప్పారు. దీని ప్రకారం 23 జూలై, 2024 నాటికి, తమ మంత్రిత్వ శాఖ ద్వారా మొత్తం 95 కేంద్రాలు మం జూరు చేశామన్నారు. వీటిల్లో 6 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేశా మని, వాటిలో శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల, తిరుపతి, ఆంధ్ర మెడికల్ కళాశాల, విశాఖపట్నం, గుంటూరు మెడికల్ కళాశాల, గుంటూరు, రంగరాయ మెడికల్ కళాశాల, కాకినాడ, సిద్ధార్థ మెడి కల్ కళాశాల, విజయవాడ, ఎయిమ్స్, మంగళగిరి వాటిలో ఉన్నాయన్నారు.

### శాశ్వత భవనాలు లేని అంగన్‌వాడీలు ఎన్ని?

రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని అంగన్‌వాడీలకు సంబంధించి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నిం చారు. 2023లో 75శాతం అంగన్‌వాడీ భవనాలను ఉపాధిహామీ పథకం కార్మి కులు నిర్మించారనేది వాస్తవమేనా?.. వాటి వివరాలు తెలియజేయాలని కోరారు. అందుకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణదేవి లిఖితపూర్వ కంగా సమాధానం చెప్పారు. ఏపీలో 23,149 అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవని తెలిపారు. 2023-24లో 360 అంగన్‌వాడీ భవనాల నిర్మా ణాలు పూర్తయ్యాయని, పీఎం జేఏఎన్ ఎంఏఎన్ పథకం కింద 2023-24లో రాష్ట్రంలో మరో 170 అంగన్‌వాడీల నిర్మా ణానికి కేంద్ర మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపిందన్నారు. ప్రత్యేకించి నెల్లూరు జిల్లా పరిధిలో 2934 అంగన్‌వాడీ కేంద్రాలు న్నాయని, వాటిలో 1162 అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి వివరించారు.

# మెడికల్ కాలేజీలలో సీట్ల పెంపుదలపై చర్యలేమిటి?

## - రాజ్యసభలో బీఎంఆర్ ప్రశ్న



మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపుదల విష యంలో కేంద్రప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటో ఆ వివరాలు తెలియజేయాలని జులై 30న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) రాజ్యసభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మంత్రి అను ప్రియ పటేల్ సమాధానమిస్తూ, ప్రభుత్వం వైద్య కళాశాలల సంఖ్యను పెంచిందని, తద్వారా ఎంబిబిఎస్ సీట్లు పెరిగాయని తెలిపారు. 2014కి ముందు 387గా ఉన్న మెడికల్ కాలేజీలు ఇప్పుడు 731కి పెరిగాయని చెప్పారు. ఇంకా 2014కి ముందు 51,348గా ఉన్న ఎంబిబిఎస్ సీట్లు ఇప్పుడు 1,12,112కి పెరిగాయని, 2014కి ముందు పీజీ సీట్లు 31,185 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య72,627కి పెరిగిందన్నారు. అదేవిధంగా, 2023-24 సంవత్సరానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 56,300 ఎంబిబిఎస్ సీట్లు మరియు 33,416 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో 2023-24వ సంవత్సరానికి 52,640 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, 21,418 పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెడికల్ సీట్లు ఉన్నాయని వివరించారు.

# విద్యార్థి మృతిపై.. విజిలెన్స్ విచారణ జరపాలి

## - ఏపీ విద్యార్థి జేఏసీ నాయకులు



నెల్లూరులోని కెఎన్ఆర్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి గురుమహేంద్ర మరణించడంపై విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ ఏపీ విద్యార్థి సంఘ జేఏసీ నాయకులు ఇటీవల డీఇఓ కార్యాలయంలోని ఏ.డి గ్లోరి కుమారికి వినతిపత్రం అంద జేశారు. వందలాది మంది విద్యార్థులున్న ఆ పాఠశాలలో కనీస రక్షణ లేకపోవడం, నాడు-నేడు పనుల్లో నాసిరకం నిర్మాణాలు జరగడంపై ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి, నాయకులు మురళీకృష్ణ, బాలు, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

# ఫోర్జరీ కేసును సీబీఐకి అప్పగించాలి

## - సీపీఐ నాయకుల డిమాండ్




నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సంతకాల ఫోర్జరీకి సంబంధించిన కేసును రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించి సీబీఐకి అప్పగించాలని నెల్లూరు నగర సీపీఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. జులై 27న స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి వరకు కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి సంతకాలను ఫోర్జరీ చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని, నెల్లూరు నగరంలో ఎన్ని భవనాలకు మార్టగేజ్‌లు చేసి ఎంతెంత వసూలుచేశారో, వీటి వెనుక ఎవరెవరి హస్తాలున్నాయో వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సీపీఐ నగర నాయకులు వాటంబేటి నాగేంద్ర, జిలానీఖాన్, లీలామోహన్, ముక్తియార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



చిత్తూరుజిల్లా వరదయ్యపాళెంలోని జడ్పీ స్కూల్‌లో శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎంసి), శ్రీసిటీ ఫౌండేషన్, పాండూరు శ్రీ కోదండరామస్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జులై 28న జరిగిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.. చెన్నై శ్రీరామ చంద్రా హాస్పిటల్స్ ప్రత్యేక వైద్య నిపుణుల బృందం వారు వైద్య సేవలు అందించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గం టల వరకు సాగిన ఈ శిబిరంలో 369 మందికి వివిధ రకాల వైద్య చికిత్సలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్‌కు చెందిన పత్యేక వైద్య నిపుణుల బృందంతో సహా ఇతర డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది సుమారు 40 మంది వైద్య సేవలు అందించారు. శ్రీ కోదండరామ స్వామి సేవా సంఘం నిర్వా హకులు పరంధామరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. వరదయ్యపాళెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని సహాయ సహకా రాలు అందించారు.

# ఏడాపెడా విద్యుత్ కోతలతో నష్టాలు

## బోగోలు మండలంలో రైతుల ఆందోళన



భరించలేని విద్యుత్ కోతలతో తాము తీవ్రంగా నష్టపోతున్నా మంటూ బోగోలు మండలంలోని పలు వురు రైతులు జులై 27న ఆ మండలం లోని చెంచులక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. బోగోలు, సీఎల్ పురం, నాగులవరం, చెన్నారెడ్డిపాళెం, తాళ్లూరు, ఏబీ కండ్రిగా గ్రామాల్లోని రైతులు పాల్గొని చిత్తం వచ్చినట్లు విద్యుత్ కోతలు విధిస్తూ సరఫరాకు అంతరాయం కలిగిం చడం వల్ల పొలాలకు నీళ్ళు పెట్టుకోలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈదురుగాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, మరమ్మతులు చేయించి సరఫరాను కొనసాగిస్తామని విద్యుత్ శాఖ అధికారి నాగూర్‌వలి నచ్చ జెప్పడంతో, రైతులు ఆందోళన విరమించారు.

# కార్గిల్ విజయోత్సవం




కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నెల్లూరులోని వైఎంసిఏ మైదానం నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు ఇటీవల ర్యాలీ నిర్వ హించారు. స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో, కాగడాలు చేతపట్టి విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. వీరజవాన్లకు జేజేలు పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా నేత అశోక్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు మాచిరాజు వెంకటేష్‌తో పాటు నాయకులు మదన్‌సాయిరెడ్డి, సాయికృష్ణయాదవ్, తిరుపతినాయుడు, కృష్ణసాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. 'శతమానం భవతి'



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జులై 28న 'శతమానం భవతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. జులై నెలలో పుట్టిన 20 మంది వాకర్ల సభ్యులచేత కేకు కట్‌చేయించి, కండువాలతో సత్కరించి, వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ ప్రతినిధులు నలుబోలు బలరామయ్యనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, జీవీ కృష్ణయ్య, మాగంటి ప్రసాద్, ఎస్కె మహమ్మద్, డి.జయరామనాయుడు, లక్కాకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.





# బాల్యమిత్రుల ఇంట్లో మన వెంకయ్య

బటర్‌ఫ్లై గృహోపకరణాల తయారీదారులు, తన బాల్యమిత్రులు కీ.శే. మురుగేశ చెట్టియార్ కుటుంబాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు కలుసుకున్నారు. సతి ఉషమ్మ, కుమార్తె దీప వెంకట్, మనుమడు విష్ణు ఇమ్మణ్ణిలతో కలిసి గత శుక్రవారం చెన్నైలోని వారి నివాసానికి వెంకయ్య వెళ్లారు.

చెట్టియార్ అయిదుగురు కుమారులు లక్ష్మీనారాయణ, బాలసుబ్రహ్మణియం, శేషాద్రి, గంగాధరన్, కుమరేశన్‌లతో పాటు వారి వారి కుటుంబసభ్యులతో కాలక్షేపం చేశారు. ఈ ఆధునిక యుగంలో కూడా పాతతరం సిద్ధాంతాలని, ఆచారాలని గౌరవిస్తూ భారతీయ సంప్రదాయాన్ని పాటిస్తూ ఉమ్మడి కుటుంబంగా 77 మంది కలిసి ఒకే ఇంట్లో ఉంటున్న చెట్టియార్ సోదరులని అభినందించారు.

దశాబ్దాల క్రితం చెట్టియార్ కుటుంబం నెల్లూరు కేంద్రంగా నివసిస్తున్న తరుణంలో, ఆయన కుమారులు తనతో పాటు కలిసి ఆర్.ఎస్.ఎస్. శాఖలో భాగస్వాములై పాల్గొన్న మధురజ్ఞాపకాలని ఈ సందర్భంగా వెంకయ్య గుర్తు చేసుకున్నారు.

# పొర్లుకట్ట రోడ్డుకు గ్రీన్ సిగ్నల్



నెల్లూరులోని పొర్లుకట్ట రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించి, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆగస్టు 1న అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగర నియోజకవర్గంలోని పొర్లుకట్ట ప్రాంతాన్ని ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించి, అక్కడున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ రోడ్డు వేయాలని తామెంతో కాలం నుంచి కోరుకుంటున్నామని స్థానికులు చెప్పారు. అందుకు మంత్రి స్పందిస్తూ, రోడ్డు నిర్మాణానికి అవసరమైన పనులను ప్రతిపాదించాలని అధికారులకు చెప్పారు. దీంతో పొర్లుకట్ట ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇరిగేషన్ పనుల్లో భారీ కుంభకోణం

## రూ.200 కోట్లు తినేశారంటూ సోమిరెడ్డి ఆరోపణ

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖలో యధేచ్ఛగా దోపిడీ జరిగిపోయిందని, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే దాదాపు 200 కోట్ల రూపాయల దాకా కుంభకోణం జరిగిందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. జులై 31న మనుబోలు మండలంలోని వీరంపల్లి, అక్కంపేట గ్రామాల్లో జరిగిన నీటిపారుదల పనులను పరిశీలించారు. అక్కంపేట పెద్దచెరువు, పొట్టేళ్లకాలువ, బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌ను రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటిపారుదలకు సంబంధించి ఏ పనులు చేయకుండా గత జనవరిలోనే సుమారు 18.70 కోట్ల రూపాయల దాకా బిల్లులు డ్రా చేసుకున్నారని, పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి, భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. మాజీమంత్రి కాకాణి ఆ పనులను



ప్యాకేజీలుగా విభజించి బినామీలకు పప్పు బెల్లాల్లాగా పంచిపెట్టారని, ఏ కాలువ దగ్గరా ఏ పనీ జరగలేదని విమర్శించారు. ఒక్క రూపాయి పని కూడా చేయకండానే, బిల్లులు ఎలా చేశారని ఆయన అధికారులను నిలదీశారు. ఈ అక్రమాలన్నిటినీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి, విజిలెన్స్ లేదా సీఐడీ వారితో విచారణ జరిపించాలని కోరానని ఆయన తెలిపారు. రైతుల కష్టాలు పట్టించుకోకుండా, వైకాపా నాయకులు అందినకాడకి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఓ అండ్ ఎం, ఎఫ్.డీఆర్, ఎన్ఆర్ఈజీఎస్, రెగ్యులర్ ఫండ్‌తో పనులు చేసినట్లు నమోదుచేసి వందల కోట్లు స్వాహా చేసేశారని, ఒకే పనిని వేర్వేరు విభాగాల కింద చేసినట్లు చూపించి నిధులు బొక్కేశారని ఆయన ధ్వజమెత్తారు.

# స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా ఉండాలి

## - అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ



78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలంటూ సంబంధిత శాఖల అధికారులను జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆయన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు బాగా జరిగేలా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకునే విధంగా ఉండేట్లు చూడాలని సంగీత కళాశాల, విద్యాశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేలా, ఆయా శకటాలపై చేసే ప్రదర్శనలు అందరిలో స్ఫూర్తి నింపేలా ఏర్పాటుచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ లవన్న, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి.. పింఛన్లు ఇచ్చిన ప్రశాంతమ్మ

## సంబరపడిన కోవూరు నియోజకవర్గం ప్రజలు

కోవూరు మండలం గుమ్మళ్ళదిబ్బ ప్రాంతంలో పింఛను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆగస్టు 1న స్వయంగా పింఛన్లు అందజేశారు. ఉదయం 6 గంటలకే నేరుగా లబ్ధిదారుల ఇళ్ళ వద్దకే వెళ్ళి ఆమె పింఛన్లు పంపిణీ చేయడంతో స్థానిక ప్రజలు సంబరపడ్డారు. 1వ తేదీనే ఇంటికి పింఛను వస్తుండటంతో పేదల కళ్లలో సంతోషం చూస్తున్నానని ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అవ్వాతాతల్ని ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్లను అందించారు. వృద్ధులకు, వితంతువులకు రూ. 4 వేల పింఛను, దివ్యాంగులకు సాయంగా 6వేల రూపాయల వంతున అందజేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె అంటూ, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని కొనియాడారు.



తానేమీ పెత్తనంచేసే నాయకురాలిని కాదని, ప్రజలకు సేవకురాలినని ఆమె తెలిపారు. ఆ తర్వాత, గుమ్మళ్లదిబ్బలో జిల్లా పరిషత్ హైస్కూలుకు వెళ్లి బడిలో వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం బాగా లేదని విద్యార్థులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి చెప్పగా, భోజనం నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఉపాధ్యాయులను ఆదేశించారు. కోవూరు టీడీపీ మండలాధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాయర్
ఆగస్టు 02, 2024

# పారిస్‌లో మెరుపులు మెరిపించిన.. 'మను'

ఒలింపిక్స్‌లో భారత్ తన సత్తా చాటుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఆరంభంలోనే సంతోషసంరంభాలతో మన షూటర్లు అదరగొడుతున్నారు. అందులోనూ భారతీయ మహిళలు క్రీడల్లోనూ అద్భుత విజయాలు సాధిస్తూ 'మహిళలే మహారాణులని' నిరూపిస్తున్నారు. ఒక్క ఒలింపిక్స్‌లోనే ఒకే సారి రెండు పతకాలు కైవసం చేసుకుని ఇరవై రెండేళ్ళ యువ షూటర్ మను బాకర్ పారిస్‌లో మెరుపులు మెరిపించింది. విశ్వక్రీడల్లో భారత్ షూటర్ల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసింది. ఎంతో క్లిష్టమైన ఈ ప్రపంచస్థాయి క్రీడల్లో అద్వితీయ విజయాలను సాధించి భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించింది. ఒలింపిక్స్‌లో ఒక్క పతకం వస్తేనే హిమాలయాన్నధిరోహించినంతటి భావోద్వేగంతో క్రీడాకారులు మురిసిపోతుంటారు. అలాంటిది మను బాకర్ రెండు పతకాలను సాధించి ఆ విజయోత్సాహాన్ని దేశానికంతా సంతోషంగా పంచుతున్నారు. గతంలో 2016, 2020 సంవత్సరాల్లో జరిగిన ఒలింపిక్స్‌లో ఎంతోమంది షూటర్లు రంగంలోకి దిగారు కానీ, ఒక్కరు కూడా పతకాన్ని సాధించలేకపోయారు. తాజాగా ప్రస్తుతం ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో క్రీడల్లో రెండు రోజుల్లోనే రెండు పతకాలు చేతపట్టి చరిత్ర సృష్టించిన హర్యానా స్టార్ షూటర్ మను బాకర్ పేరు దేశంలోనే కాదు, ప్రపంచమంతా మారుమోగిపోతోంది. స్వతంత్ర భారతావనిలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు పొందిన తొలి భారత క్రీడాకారిణిగా మను ఘనత సాధించింది. అందులోనూ ఎంతో కష్టసాధ్యమైన షూటర్ల విభాగంలో అంతటి విశేషస్థానం సాధించిన ప్రతిభ కూడా మనుదే. క్రీడల ప్రారంభంలో మహిళల వ్యక్తిగత విభాగంలో ఆదివారం రోజున 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో పాల్గొన్న మను బాకర్, ప్రపంచస్థాయి షూటర్లను కూడా అధిగమించి మూడవస్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. ఇది ఒలింపిక్స్‌లో మనుకి తొలి పతకం. ఆ తర్వాత రెండురోజుల్లోనే భారత యువ షూటర్ సరభ్‌జోత్‌సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో మను మరో కాంస్య పతకాన్ని సాధించి భారత క్రీడాచరిత్రలోనే మను అరుదైన రికార్డు సృష్టించడం విశేషం. జులై 30న జరిగిన ఈ ఈవెంట్‌లో మను-సరబ్‌జోత్ జోడీ 16-10 తేడాతో కొరియా షూటర్‌లను ఓడించిది. ఒకరి తర్వాత మరొకరు ధీటుగా రాణించారు. చెక్కుచెదరని ఏకాగ్రతతో, గురి తప్పకుండా పిస్టల్ పేల్చడంలో అత్యంత నైపుణ్యాన్ని కనపరచి మన యువ షూటర్లు పతకవీరులయ్యారు. దీంతో మను, సరభ్‌జోత్ సింగ్‌ల పట్ల ప్రపంచ క్రీడారంగంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన ఆరవ భారతీయ క్రీడాకారునిగా సరబ్‌జోత్ గుర్తింపు పొందాడు. ఈ యువ షూటర్లిద్దరికీ 'జయహో' అంటూ దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. యువకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులందరూ రైఫిల్ షూటర్లుగా వారి అద్వితీయ క్రీడా ప్రతిభను మెచ్చుకుంటున్నారు. అందులోనూ కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రెండు కాంస్య పతకాలు సాధించడం అబ్బురమంటూ అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా మను బాకర్ చరిత్ర సృష్టించడం దేశానికే గర్వకారణమని భారత రాష్ట్రపతి ముర్ము కూడా అభినందించారు. ప్రధాని నరేంద్రమోడీ కూడా ఈ యువ షూటర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

అయితే, ఇక్కడే మరో విశేషం కూడా ఉంది. ఈ ఒలింపిక్స్‌లో తాను పోటీపడిన రెండు ఈవెంట్లలోనూ పతకాలు సాధించిన మను 3వ పతకం కూడా సాధించే అవకాశం ఎంతైనా ఉంది. ఆగస్టు 2వతేదీన 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ క్వాలిపైయింగ్ బరిలోకి దిగి తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు సమాయత్తమవుతోంది. ఈ క్వాలిఫయింగ్‌లో రాణించి ఫైనల్స్‌కు చేరితే, ఆగస్టు 3న 3వ పతకంపై కూడా మను గురిపెట్టేందుకు వీలుంటుంది. అప్పుడు కూడా మను విజయాన్ని సాధిస్తుందని భారతీయులంతా వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు. అయితే, మను మాత్రం నిమ్మళంగానే ఉంది. సంతోషం పెల్లుబుకుతున్నా నిబ్బరంగా ఉంటూ, 'ఒలింపిక్స్‌లో ఒక్క మెడల్ వస్తే చాలు.. అని క్రీడాకారులంతా తపిస్తుంటారు. నేను రెండు పతకాలు సాధిస్తానని అసలు ఊహించనే లేదు. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో కూడా గెలిస్తే ఇక అంతకుమించి సంతోషం ఏముంటుంది. నాపై ఎంతో ప్రేమను కురిపిస్తున్న ప్రజల ఆత్మీయాభిమానాలను నేనెన్నడూ మరిచిపోను'.. అంటూ మను ఎంతో వినమ్రతతో చెప్తోంది. ఏదేమైనా, 3వ ఈవెంట్‌లో కూడా పోటీపడి గెలిచి, 3వ పతకం కూడా మను సాధించి తీరుతుందని అందరూ ఆశిస్తున్నారు. ఆల్ ది బెస్ట్!.. మను!...




# నాసిరకం నిర్మాణాలు.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు!

## లోపించిన చిత్తశుద్ధి... నాణ్యత లేని అభివృద్ధి!!

అవును...! మనదేశంలో ఎప్పుడూ ఇంతే. కుప్పలు తెప్పలుగా గొప్పలు చెప్పుకోవడం తప్ప నిజమైన అభివృద్ధి మాత్రం శూన్యమే. అవినీతి సర్వాంతర్యామిగా, అక్రమాలే అంతర్యామిగా విరాజిల్లుతున్న నేటి రోజుల్లో, ధన సంపాదనే తప్ప జనసంక్షేమాన్ని పట్టించుకునే నాథులే కనిపించడం లేదు. అటు పాలకులు, ఇటు నాయకులు, మరోవైపు అవినీతి అధికారులు అంతా కలసి ప్రజాసంక్షేమ పనుల్లో కూడా తమ సంక్షేమమే చూసుకుంటున్నారు. ప్రజోపయోగం కోసం చేపట్టే అనేకరకాల అభివృద్ధి నిర్మాణపు పనుల్లో అక్రమాలకి పూనుకుంటున్నారు. ఈ అవినీతి జాడ్యం దేశమంతా పాకిపోయింది. ప్రభుత్వ పరంగా చేపట్టే అనేక నిర్మాణాల్లో భూతద్దం పెట్టి వెతికినా 'నాణ్యత' కరువయ్యింది. ఇదే మాట పదే పదే నిపుణులు చెప్తున్నా వినేవారు పట్టించుకునేవారు లేరు.

రోడ్లు, నీటి పారుదల ప్రాజెక్టులు వంటి వాటితోపాటు పాఠశాలలు, కార్యాలయాలు లాంటి ప్రభుత్వ భవనాలు కూడా కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకే అప్పజెప్పడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఇలాంటి అనేక రకాల కట్టడాలు, భవనాల నిర్మాణాలు నిత్యం దేశమంతటా జరుగుతున్నా, ఆ పనుల్లో నైపుణ్యం లేదు, కనీస నాణ్యతా లేదు. కమిషన్ల కక్కుర్తి తప్ప, నియమనిబంధనలను పాటించి నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలనే కనీస ఆలోచనే లేదు.

ఎలాంటి అధునాతన ఇంజనీరింగ్ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానాలు లేని పురాతన కాలంలో రాజ్యాలేలిన రాజులు తమ నేతృత్వంలోఅద్భుతమైన ఆలయాలు, భారీ బురుజులు, కళ్ళు తిరిగే కోటలు, బహుళ అంతస్తులతో అందంగా ఆకర్షణీయంగా నిర్మించారు. ప్రతిభావంతులైన శిల్పులచేత కళా నైపుణ్యంతో వాటిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆనాటి మేధావుల ప్రతిభానైపుణ్యాలకి నిదర్శనంగా ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఎన్నో కట్టడాలు చెక్కు చెదరకుండా మన కళ్లెదుటే సాక్షాత్కరిస్తున్నాయి. వందల ఏళ్లనాటి ఆ నిర్మాణాలు ఈ నాటికీ కనీసం మట్టిపెళ్ల కూడా రాలకుండా గట్టిగా నిలుచున్నాయి. నేటి అధునాతన యుగంలో, అనేక అద్భుతమైన ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చినా, శాస్త్రపరిజ్ఞానం అరచేతిలో ఉన్నా.. మనం చేపట్టే నిర్మాణాలలో మాత్రం నాణ్యత కల్లగా, నైపుణ్యత డొల్లగా ఉండడం వెనుక వున్న మర్మం ఏమిటో మన పాలకులకే తెలియాలి.

### పేరు గొప్ప.. ఊరు దిబ్బ!

ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో రోడ్లు, వంతెనలు, బహుళ అంతస్తుల మహాసౌధాలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. ఔరా అనిపించేలా కనిపించే ఆకాశహర్మ్యాలు చూడడానికి రెండుకళ్ళూ చాలవు. భారతదేశం కూడా సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని మనం గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ, వాస్తవ పరిస్థితిలో మాత్రం పేరు గొప్ప.. ఊరు దిబ్బగా మిగిలిపోతున్నాం. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న రోడ్లు కొన్ని రోజులకే పాడైపోతున్నాయి. కనీసం ఐదేళ్లు చెక్కు చెదరకుండా ఉండాల్సిన రోడ్లు ఆరు నెలలకే గుంతలు పడుతున్నాయి. పదేళ్ల వరకు కళకళలాడాల్సిన భవనాలు ఏడాదికే కళా విహీనమవుతున్నాయి. వరదొలొచ్చినా తట్టుకోవలసిన వంతెనలు చిన్నపాటి వానలకే వంగిపోతున్నాయి. దానికి కారణమేమిటి..? కారకులెవరు..?? ఇతర దేశాలకి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం మనకి లేదా అంటే.. కాదు. చేపట్టిన పనులకి తగ్గట్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదా అంటే.. కాదు. మరి ఎందుకు నాణ్యత లోపిస్తుంది...? ఎందుకు రోడ్లు పాడవుతున్నాయి...?? ఎందుకు వంతెనలు, భవనాలు కూలుతున్నాయి...??? అంటే వీటికి లభించే సమాధానాలు ఇవే... స్వార్థం, ధనదాహం, అవినీతి, అలసత్వం.

### వ్యవస్థలలో లోపం.. అవస్థల శాపం!

పాలకులు, అధికారులు, రాజకీయపార్టీల నాయకుల కాళ్ళు పిసికే దళారీల వల్లే వ్యవస్థలు అవస్థలపాలవుతున్నాయి. ప్రజల సొమ్ముతో జరిగే ప్రభుత్వ నిర్మాణాలు నాసిరకంగా అవతరిస్తున్నాయి. నాయకుల స్వార్థం, అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ల ధనదాహం, ప్రభుత్వ పెద్దల అలసత్వం కారణంగానే వేలాది కోట్ల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగాల పాలవుతోంది.

తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా చేతులు తడపనిదే ఏ పనులూ జరగవు. మనం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ముందుకు సాగిపోతున్నాం అని ఊరకే గొప్పలు చెప్పుకుంటున్నామే తప్ప, వ్యవస్థల్లో జరుగుతున్న లోపాలను గుర్తించడం లేదు. నాసిరకం నిర్మాణాలతో అనునిత్యం జరిగిపోతున్న కోటాను కోట్ల నిధుల దుర్వినియోగం గురించి అసలు ఆలోచించడమే లేదు.

### నాణ్యత డొల్ల.. నైపుణ్యం కల్ల!

దేశంలో ఎక్కడైనా ఏదైనా భారీ కట్టడం కూలిపోయినప్పుడు మాత్రం పాలకులు, అధికారులు నానా హడావిడి చేస్తారు. బాధ్యులైన వారిపై ఉత్తుత్తి చర్యలు తీసుకుంటారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూస్తామని ప్రగల్భాలు పలుకుతారు. అయితే, గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వ నిర్మాణాలు పేకమేడల్లా కూలిపోతూనే వున్నాయి. వందల ప్రాణాలు గాల్లో కలిసిపోతూనే ఉన్నాయి. ఈ దుర్ఘటనలకి కారణమైన వారి పైన ఎలాంటి చర్యలు తీసుకున్నారో, ఎంత మందిని శిక్షించారో ఆ దేవుడికే తెలియాలి. దుర్ఘటనలు జరిగినప్పుడు మరణించిన వారి కుటుంబాలకి లేదా గాయపడ్డవారికి పరిహారం ఇచ్చి సరిపెట్టేసుకుంటున్నారే తప్ప, ఆ కుటుంబాలు జీవితాంతం పడే గుండెఘోషను ఎవరూ గుర్తించడం లేదు.

ప్రభుత్వ నిర్మాణాల విషయంలో కఠినతరమైన నిబంధనలు రూపొందించాలి. నిర్దిష్ట గడువులోగా సదరు నిర్మాణం దెబ్బతింటే దాన్ని పునరుద్ధరించే బాధ్యత పాత కాంట్రాక్టర్‌కే అప్పజెప్పాలి. ప్రమాదవశాత్తు మరణించిన వారికీ, గాయపడిన వారికి నష్ట పరిహారం సైతం అదే కాంట్రాక్టర్ చేత ఇప్పించాలి. ఆ నిర్మాణం జరిగే పనులను పర్యవేక్షించిన ప్రభుత్వ అధికారులను సస్పెండ్ కాదు, విధులనుండే తొలగించాలి. ఇలాంటి కఠినతరమైన నిర్ణయాలతో చట్టాలని తేవాలి. వాటిని పటిష్టంగా అమలుచేయాలి. అప్పుడే తప్పు చేయాలంటే కాంట్రాక్టర్‌ల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయి. ఇకనైనా ప్రభుత్వాలు మేలుకొని దేశభవితను, ప్రజాసంక్షేమాన్ని దృష్టిలోపెట్టుకుని పని చేయాలి. నాణ్యతలేని అడ్డగోలు నిర్మాణాలపై దృష్టిపెట్టి గట్టి చర్యలు తీసుకోవాలి. బలమైన వ్యవస్థలతో మెరుగైన నిర్మాణాలకు పునాది వేయాలి!

- రాజశ్రీ

# దేవుళ్ళని సైతం దోచేస్తున్నారు!

సంపాదనకి కాదేది అనర్హం... అన్నట్లుగా రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. తమ ధన దాహం తీర్చుకోవడానికి రాజకీయాల ముసుగులో దేవుళ్ళని, దేవాలయాలని కూడా వదిలిపెట్టడం లేదు. తిరుమల తిరుపతి దేవస్థానాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలోనే గత కొన్ని సంవత్సరాలుగా దర్శనాలు అమ్ముకుంటున్నారు. సభ్యుల ముసుగులో రాజకీయపార్టీల వ్యక్తులు పాలకమండలిలో దూరి ఈ అమ్మకాల భాగోతం కొనసాగిస్తున్నారు.

గత వారం మన 'లాయర్'లో జొన్నవాడ దేవస్థానంలో జీతాలకి కూడా డబ్బుల్లేవన్న వార్త చూసి బాధ కలిగింది. ఎంతో మహిమ కలిగిన అమ్మవారి గుడిని సైతం పొలిటికల్ బ్రోకర్లు తమ అక్రమాలకు అడ్డాగా మార్చుకోవడం సిగ్గుచేటైన విషయం. ఉన్నత స్థానాల్లో వున్న ప్రజా ప్రతినిధులు కూడా కాసులకి కక్కుర్తిపడి దేవాలయాల ఛైర్మెన్ పదవులని దోపిడీదారులకి అమ్ముకోవడం వారి నీతిమాలిన తత్వానికి నిదర్శనం. ఇలాంటి తప్పులు ఎవరు చేసినా క్షమించకూడదు. అత్యంత శక్తివంతమైన కామాక్షమ్మ ఆలయ ప్రక్షాళనకి ప్రశాంతిరెడ్డి పూనుకోవడం మంగళదాయకం. భవిష్యత్తులో ఎవరైనా తప్పు చేయాలంటే భయపడే విధంగా గత అక్రమదారులని శిక్షించాలని ఆ జగన్మాతని ప్రార్థిస్తున్నాను.

పి. లక్ష్మీనారాయణ, హైదరాబాదు.




# బండెక్కాలంటే భయమేస్తోంది!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ చూస్తుంటే హడలు పుడుతోంది. మోటారుసైకిలో, స్కూటరో ఎక్కి ట్రంకురోడ్డుకి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఒక బండిపైన ముగ్గురుంటే పోలీసులు కేసులు రాసే వాళ్ళు, ఇప్పుడు నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది ద్విచక్ర వాహనాలపై సవారి చేస్తున్నారు. ఇక ఆటో వాలాల సంగతి చెప్పక్కరలేదు. డ్రైవింగ్ సీటుకి అటు ఇద్దరు ఇటు ఇద్దరు, మళ్ళీ వెనుకపక్క ఓ 6మంది, అంటే డ్రైవరుతో సహా ఒక్క ఆటోలో 11మందిని ఎక్కిస్తున్నారు. తోలేవాడికి హ్యాండిల్‌పైన అదుపే ఉండదు. ఆటోలో ప్రయాణంచేసే వారితో పాటూ సదరు ఆటోకి ఎదురొచ్చిన వారి పరిస్థితి కూడా ప్రమాదకరమే. ఇక యువత వేగానికి అదుపే లేకుండా పోతోంది. తమ ఇష్టారాజ్యంగా వాహనాలపైన సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. నిర్భయంగా రాంగ్‌రూట్లలో వెళ్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇవన్నీ అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం. ముందే మేలుకుంటే మంచిది.

ఆర్.పీ.రామయ్య, కొండాయపాలెం.

# పోలీసు గస్తీ ముమ్మరం చేయాలి!

నగరంలో దొంగతనాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో నగర శివారు ప్రాంతాలు అసాంఘిక కార్యక్రమాల నిలయాలుగా మారిపోయాయి. పట్టణ నడిబొడ్డులో ఉన్న మాగుంట లే అవుట్‌లో సైతం ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. రైలుకట్టకి అనుకుని డిమార్ట్ వైపుకివెళ్లే రోడ్డు మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించేవారికి అడ్డాగా మారిపోయింది. పోలీసులు దృష్టి సారించి గస్తీ ముమ్మరం చేయాలి.

వీ.సీ.చౌదరి, నెల్లూరు.

# మొక్కలు నాటుదాం.. పచ్చదనం కాపాడుదాం

## 'అమ్మ పేరుతో ఒక మొక్క'కి అపూర్వ స్పందన

*మానవ మనుగడకు ప్రాణప్రదమైన ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, పచ్చదనాన్ని పరిరక్షించుకుంటేనే స్వచ్ఛమైన ప్రాణవాయువు మనకు అందుతుందని, భూమాత కూడా చల్లగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్రమోడీ 'మన్ కీ బాత్'లో కొద్దిరోజుల క్రితం ఇచ్చిన పిలుపుకు నెల్లూరుజిల్లాలోనూ అపూర్వ స్పందన కనిపిస్తోంది. ప్రతి మొక్కను అమ్మలా కాపాడుకోవాలని, అమ్మ మనల్ని చూసుకున్నట్లుగానే మొక్కలను కూడా ప్రేమగా చూసుకోవాలన్న ప్రధాని మాటలు ప్రజలను, ప్రకృతి ప్రేమికులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో కేంద్ర క్షేత్రప్రచార శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలు, అధికారులు, స్వచ్ఛంధసంస్థలు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక మహోద్యమంలా సాగించేందుకు అన్ని ప్రాంతాల్లోనూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి. రండి!..మొక్కలు నాటుదాం..పచ్చదనం కాపాడుకుందాం'..'వృక్షో రక్షతి..రక్షిత:'!...*

### కోటమిట్ట స్కూల్‌లో....

నెల్లూరు నగరంలోని కోటమిట్ట కృష్ణమందిరం వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇటీవల 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, నెల్లూరు డివిజన్ సామాజిక వన విభాగం, శుభమస్తు షాపింగ్‌మాల్, వారధి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బుజబుజనెల్లూరులో....



'మొక్కలు నాటండి-ప్రకృతిని కాపాడండి' అంటూ సెట్నెల్ సీఇఓ వెంకటయ్య పిలుపునిచ్చారు. జులై 27న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుజబుజనెల్లూరు పీఎంపి కార్యాలయం నుంచి పండ్లూరు కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ కాస్మటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ డోలా సుస్మిత ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం, స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. వైద్యాధికారి డాక్టర్ షేక్ ఇమ్రాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌బాషా, షేక్ రసూల్, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గయాజ్ పాల్గొన్నారు.

### ఆమంచర్లలో...



నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జులై 27న 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమాన్ని చేపట్టారు. డీఇఓ రామారావు పాల్గొని అమ్మ పేరుతో మొక్కను నాటారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, నెల్లూరు డెప్యూటీ ఇఓ ప్రసన్నలక్ష్మి, ఎంఇఓ సుధీర్‌బాబు, సిఎంఓ పెంచలయ్య, ఎంఇఓ ఆర్.మురళీధర్, పాఠశాల హెడ్మాస్టర్ ఏ.రాజు పాల్గొన్నారు.

### కొత్తూరులో...

నెల్లూరు రూరల్, కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో జులై 2న 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ శంకరయ్య ఆధ్వర్యంలో విద్యాలయంలో మొక్కలు నాటారు. కోఆర్డినేటర్ అలివేలు మంగబాయి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ జోషిబాబు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు దొరసానమ్మ, ప్రణీత, రవికిరణ్ పాల్గొన్నారు.

### పల్లిపాడు 'డైట్'లో...

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న 'డైట్' విద్యా శిక్షణాసంస్థలో ఛాత్రోపాధ్యాయులు జులై 27న 'అమ్మ పేరుతో' మొక్కలు నాటారు. డైట్ ప్రిన్సిపాల్ డా.పి.రమేష్, సీనియర్ అధ్యాపకులు డా.కె.వెంకటేశ్వరరావు, డా.ఆర్ బాలాజీరావు, ఉపన్యాసకులు కె.విజయచంద్ర, కార్యాలయం సూపరింటెండెంట్ ఏం.మేరీప్రసూన, పూర్వ అధ్యాపకులు డా.బి.శ్రీనివాసులు, పర్యవేక్షకులు ఎస్.సురేష్ పాల్గొన్నారు.

### పాములమిట్ట స్కూల్‌లో...

తడ మండలం పాములమిట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ క్లబ్‌ను ఏర్పాటు చేసి, జులై 27న 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం చేపట్టి విద్యార్థులతో మొక్కలు నాటించారు. పాఠశాల హెడ్మాస్టర్ షేక్ ఉస్మాన్‌బాషా, సీఆర్ఎంటీ మునుస్వామి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

### ఏటూరు పాఠశాలలో...

చేజర్ల మండలంలోని ఏటూరు పాఠశాలలో విద్యాశాఖాధికారి-2 మస్తానయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు జులై 27న మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. మొక్కలు నాటడమే కాక, వాటి సంరక్షణకు కూడా విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులు చెప్పారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





### రావూరువారికండ్రిగలో...



తోటపల్లిగూడూరు మండలం రావూరువారి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల అమ్మ పేరుతో మొక్కలు నాటారు. నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఓ జయరామనాయుడు, పాఠశాల హెడ్మాస్టర్ నారాయణ, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా పినాకిని వార్షికోత్సవం

నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 17వ వార్షికోత్సవం ఇటీవల నెల్లూరులోని టౌనుహాలులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థలనటుడు వల్లకవి సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. వర్ధమాన కళాకారులచే కూచిపూడి ప్రదర్శనలు, కవి సమ్మేళనం, ప్రముఖులకు విశిష్ట సేవారత్న పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా విశిష్ట సేవారత్న గ్రహీతలు సరస్వతి పద్మజ, షేక్ షబ్బీర్, డాక్టర్ రామచంద్రుని లక్ష్మీ శ్రీనివాస శర్మ, కె.వెంకటేశ్వర్లురాజు, పసుపులేటి ఉష, షేక్ గులాం హుస్సేన్, ఎమ్.సుబ్బారాయుడు, కాల్వ వెంకటేశ్వర్లు, తోట రాజ్యలక్ష్మి, తిరుమలశెట్టి లక్ష్మీ నారాయణ, మహర్షి సాగర్‌లను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా సినీ దర్శకులు చంద్రమహేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షులు వేముల హజరత్తయ్య, నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, మదీనా వాచ్ గ్రూప్స్ అధినేత ఇంతియాజ్, పేరూరి ప్రదీప్, అందే శ్రీనివాసులు, షేక్ రియాజ్ బాషా, నిర్వాహకులు కె.మురళీమోహన్‌రాజు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, రవి గోగులపల్లి, చీదరాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెఎన్ఆర్ స్కూల్‌లో విద్యార్థి దుర్మరణం

### నాసిరకం నిర్మాణమే ప్రాణం తీసిందా?..

నాసిరకం నిర్మాణం అభంశుభం తెలియని ఓ విద్యార్థి ప్రాణం తీసింది. నెల్లూరు నగరంలోని బీవీనగర్‌లోని కెఎన్ఆర్ పాఠశాల ఆవరణలో గోడ కూలి 9వ తరగతి చదువుతున్న గురుమహేంద్ర(14) అక్కడికక్కడే కన్నుమూయడం జిల్లాలో విషాదం కలిగించింది. వివరాలిలా ఉన్నాయి.

వెంకటగిరికి చెందిన గురవయ్య-రూప దంపతులు పొట్టచేత పట్టుకుని జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం నెల్లూరుకు వచ్చారు. గురవయ్య ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరాడు. వీరి కుమారుడు కెన్ఎన్ఆర్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఆ పాఠశాల ఆవర ణంలో 'నాడు-నేడు' పథకం కింద అదనపుగదుల నిర్మాణం కోసం పనులు చేపట్టారు కానీ, అవి అసంపూర్ణంగానే ఉన్నాయి. అక్కడికి వెళ్ళిన ఆ విద్యార్థి తలపై దురదృష్టవశాత్తూ సన్‌షేడ్ కూలి పడడంతో అక్కడికక్కడే మరణించాడు. దీంతో ఆ తల్లితండ్రుల వేదన వర్ణనాతీతం. ఆ సమాచారం తెలుసుకున్న స్థానిక నేతలు, అధికారులు, డీఇఓ రామారావు, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డితో పాటు పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఆ నిర్మాణాల వద్దకు వెళ్ళవద్దని ఉపాధ్యాయులు ముందుగానే హెచ్చరించివుంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదని స్థానికులు అంటున్నారు. విద్యార్థి మృతి బాధాకరమని, నాసిరకం నిర్మాణం వల్లే సన్‌షేడ్ కూలిందని, ఈ సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ దుర్ఘటన తెలుసుకున్న మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్, స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, గునుకుల కిషోర్ తదితరులు విద్యార్థి మృతికి బాధను వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



### బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

నెల్లూరులోని కెఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో గోడ కూలి ఓ విద్యార్థి మరణించారన్న విషయం తెలుసుకున్న రాష్ట్రమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అమరావతిలోని తన ఛాంబర్‌లో ఉన్న మంత్రి నారాయణకు ఆ సమయంలో అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, ఆ ప్రమాద విషయాన్ని తెలియజేశారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని నెల్లూరుజిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల పరిహారం ప్రకటిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.

ఆమేరకు జూలై 30న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర కమిషనర్ సూర్యతేజతో కలిసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి 5 లక్షల రూపాయల పరిహారాన్ని వారికి అందజేశారు.

# నెల్లూరు కబుర్లు

## మెప్మా పీడీ, డీఇఓలకు కలెక్టర్ అభినందన



పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే)ని పురస్కరించుకుని జిల్లా నుండి ఎక్కువ మొత్తంలో నిధి సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేసిన మెప్మా పీడీ రవీంద్ర, డీఇఓ రామారావులను జులై 29న జిల్లా కలెక్టర్ మరియు జిల్లా సైనిక సంక్షేమ బోర్డు ఛైర్మెన్ ఆనంద్ అభినందించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వారిని కలెక్టర్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. మెప్మా పీడీ రూ. 6.57 లక్షలు, డిఇఓ రూ. 3.3 లక్షలు సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేశారని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పివిఎస్ రమేష్ తెలిపారు. జిల్లాలో సైనిక సంక్షేమ నిధి కోసం మొత్తంగా రూ. 18 లక్షలు సేకరించి మూడవ స్థానం సాధించినందుకు రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నామని కూడా ఆయన తెలిపారు.

## పాఠశాలల్లో జాగ్రత్తలు తీసుకోండి

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణంలో వున్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఈవోలు, హెచ్ఎంలకు సూచించారు. ఇటీవల ఆయన అధికారులతో తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. నెల్లూరు, బీవీ నగర్‌లో కెఎన్ఆర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద రోప్‌లు కట్టి, డేంజర్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

## హెల్మెట్ ధారణపై..విఎస్‌యులో అవగాహన



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా యూనివర్సిటీలో ఇటీవల హెల్మెట్ ధారణపై అవగాహనను కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాలను కాపాడుకోగలరని చెప్పారు. హెల్మెట్ వాడకం ద్వారా దేశంలో అనేకమంది రోడ్డు ప్రమాదాల నుంచి బయటపడ్డారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి. హెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వి.సుబ్బారెడ్డి, నోడల్ ఆఫీసర్ నీలమణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం..సాయిబాబా నగరోత్సవం



నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు గాంధీనగర్‌లో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో, గురుపూర్ణిమ ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి నేత్రపర్వంగా నగరోత్సవం జరిగింది. విద్యుద్దీపాలంకరణలతో, పూల అలంకరణలతో, మంగళవాద్యాలు, కోలాటాలు, భజనల మధ్య నెల్లూరు పురవీధుల్లో సాయినాథుని నగరోత్సవ వేడుక వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవానికి తరలివచ్చారు. సాయి నామం మార్మోగింది. సాయిబాబా మందిరం కమిటీ ఛైర్మెన్ మన్నెం అమరనాథరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. మంగళవారం నాడు భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.

## రోడ్లపై గుంతలు పూడ్చండి

**కమిషనర్ సూర్యతేజ**



నెల్లూరు నగరంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని, ట్రంకురోడ్డు, మినీబైపాస్‌రోడ్డు, పొదలకూరురోడ్డుపై ఉన్న గుంతలను సరిచేయాలని నెల్లూరు నగర కమిషనర్, ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. జులై 30న కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆయన కార్పొరేషన్ ఇంజనీర్లు, ఆర్అండ్‌బి, విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రోడ్ల దుస్థితిని సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందికరంగా తయారైవున్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు.

## ఆగస్టు 4న 'కళాంజలి'.. సంగీత సంబరం



**'పాడుతా తీయగా' గాయకులచే పాటల విందు**

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆగస్టు 4వ తేదీన నెల్లూరు టౌన్‌హాలులో సంగీత సంబరం నిర్వహించి సింహపురీయులను అలరించనుంది. పాడుతా తీయగా గాయనీ గాయకులు జ్ఞానశ్రీ, అనూష, గాయత్రి, అజిత్‌రామ్, శ్రీకృతి తదితరులు 'స్వరఝరి' పేరుతో వీనులవిందుగా పాటల విందు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, విశ్వసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకటరవికుమార్, టౌన్‌హాలు ట్రస్టుబోర్డు సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నెలుబోలు బలరామయ్యానాయుడు, కళాంజలి సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా జీ లిటిల్ ఛాంప్స్ విజేత సాయివేద వాగ్దేవికి 'కళాంజలి అవార్డు' ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్, నిర్వాహకులు దువ్వూరు బెనర్జీ తెలిపారు. ఆరోజు సాయంత్రం 6.05 గంటలకు ఈ సంబరం ప్రారంభం అవుతుందని, సంగీతాభిమానులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి.. ఆడికృత్తిక పూజలు



ఆడికృత్తిక సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయ అర్చకులు జులై 30న విశేష అలంకారాలు, విశిష్టపూజలు చేశారు. అనంతరం, పేట ఉత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



## సైనికుల త్యాగం మరువలేనిది

**క్షేత్ర ప్రచారశాఖ అధికారి పరవస్తు**

సైనికుల త్యాగం మరువలేనిదని, వారి దేశభక్తిని యువతరం ఆదర్శంగా తీసుకొని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని నెల్లూరులోని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారశాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి పిలుపునిచ్చారు. 'కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాలను పురస్కరించుకుని స్థానిక వెంగళరావునగర్‌లోని తాతయ్యబిడిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాల పునాదుల మీదనే దేశ శాంతి సౌఖ్యాలు ఆధారపడివున్నాయన్నారు. వారి స్ఫూర్తితో అవినీతిని రూపుమాపేందుకు, సామాజిక దురాచారాలను అరికట్టేందుకు యువత కృషిచేయాలన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. అనంతరం కార్గిల్ అమరవీరులకు నివాళిగా, 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.

## ఫోర్జరీ కేసు నిందితుల్లో.. ఒకరు దొరికారు

నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేసిన గత కమిషనర్లు హరిత, వికాస్‌మర్మత్‌ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడైన శివకృష్ణను పోలీసు ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయి. ఈ కేసులో నగర మేయర్ భర్త జయవర్ధన్, ఆయన వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణతో పాటు మరో అయిదుగురిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుడు శివకృష్ణను పోలీసులు సాంకేతిక ఆధారంగా గుర్తించి అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం కూడా పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## ఆగస్టు 10న..జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరుగనుంది. ఈ సమావేశంలో పలు శాఖల పురోగతికి సంబంధించిన సమీక్షలు, జడ్పీకి చెందిన 5 స్థాయీ సంఘాలకు ఖాళీ అయిన సభ్యులను ఎన్నుకోవడం జరుగుతాయని జడ్పీ సీఈఓ కన్నమనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

## డా. సినారె సాహిత్య పురస్కారాలు



ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠం, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ సినీకవి డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలు నెల్లూరు డీకేడబ్ల్యు కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఘనంగా జరిగాయి. తెలుగుశాఖ అధ్యక్షురాలు డా. కె.కరుణశ్రీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరసం రాష్ట్ర కార్యవర్గసభ్యులు పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ, సినారె కవితా వైభవం, అరుదైన రచనాశైలి తెలుగు సాహిత్య ప్రపంచంలో ఆయనకు ప్రత్యేకస్థానం సాధించిపెట్టాయన్నారు. అరసం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య సినారె విశ్వంభర కావ్యంపై ప్రసంగించారు. తెలుగు డిగ్రీ విద్యార్థినులు ఎల్.సుమ, టి.గాయత్రి, పి.మహి, నారాయణరెడ్డి జీవితం, సాహిత్యంపై మాట్లాడారు. ఆచార్య కె.వి.సత్యనారాయణ, హిందీ శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ సురేంద్ర, ఉపన్యాసకులు డా.దివ్య, డా. ఈశ్వరమ్మ, డా.సుభాషిణి, డా.ఎస్.కె.సుభాని పాల్గొన్నారు. అనంతరం సింహపురి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు అరంబాకం చంద్రశేఖర్, పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య, కె.కరుణశ్రీలకు డా.సినారె సాహిత్య పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు.




# టిడ్కో ఇళ్లకు..త్వరలో మహర్దశ

- మరో మూడునెలల్లో మౌలిక వసతులు
- భరోసా ఇచ్చిన మంత్రి నారాయణ



రాబోయే రోజుల్లో టిడ్కో ఇళ్ళకు మహర్దశ రాబోతోంది. లబ్దిదారులకు అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటుచేసి, టిడ్కో ఇళ్లను ప్రజలకు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. మరో మూడు నెలల్లోనే ఆ ఇళ్ళకు మౌలిక సౌకర్యాలను కలుగజేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇటీవల అమరావతిలో జరిగిన సమావేశంలో భరోసా ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్ళ లబ్దిదారులో సంతోషం వ్యకమవుతోంది. 'గత వైకాపా ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నాశనం చేసిందని, ఎలాంటి కారణం లేకుండానే టిడ్కో ఇళ్లను తగ్గించేసిందని మంత్రి నారాయణ ఈ సందర్భంగా చెప్పారు. అమరావతి సమీపంలోని మందడం, దొండపాడు గ్రామాల్లోని టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలించి, లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, 2014-2019 మధ్యలో నిరుపేదల కోసం మంచి నాణ్యత ఉన్న ఇళ్లను నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నుంచి 7 లక్షలకు పైగా ఇళ్ళ నిర్మాణాలకు అనుమతి తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పారు. టిడ్కో ద్వారా ఇళ్లు నిర్మించేలా పాలనాపరమైన అనుమతులు జారీ చేశామన్నారు. వాటిలో స్థలం ఉన్న చోట ముందుగా 4,54,704 ఇళ్లకు టెండర్లు పిలిచామని, మిగిలిన వాటికి స్థలం ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించామని చెప్పారు. టెండర్లు పిలిచిన వాటిలో 3,13,832 ఇళ్లు నిర్మాణం ప్రారంభం కాగా, 77371 ఇళ్లు 90 నుంచి 100 శాతం పూర్తయినట్లు మంత్రి తెలిపారు. మరో 64,245 ఇళ్లు 50 నుంచి 75 శాతం, 49,325 ఇళ్లు 25 నుంచి 50 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. లక్షా 22 వేల ఇళ్లు 10 నుంచి 25శాతం లోపు గతంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం ఇళ్లను గత వైసీపీ ప్రభుత్వం 2,62,216కు తగ్గించడమే కాక కేవలం లక్షా 67 వేల ఇళ్లు మాత్రమే పూర్తిచేసిందని విమర్శించారు. వీటిలోనూ 77 వేల ఇళ్లు తమ హయాంలోనే నిర్మించామని మంత్రి తెలిపారు. రాజధాని రైతులకు కౌలు డబ్బులు కూడా త్వరలోనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని కూడా మంత్రి నారాయణ చెప్పారు.



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో.. ఎంపీ వేమిరెడ్డి భేటీ

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జులై 22న భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని శాలువతో సత్కరించారు. అనంతరం వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. జిల్లాలోని సహజవనరులు, గనులకు సంబంధించి పలు విషయాలను వేమిరెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

## 'నాడు' లేదు..'నేడు' లేదు.. అన్నీవైఫల్యాలే!

### వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



'పాఠశాలలు బాగుచేస్తామన్నారు. నాడు-నేడు అన్నారు. ఆ తర్వాత 'నాడు లేదు-నేడు లేదు'..అన్నీ అటకెక్కిపోయాయి. వైకాపా అయిదేళ్ళ పాలనలో ప్రజలకు చేసింది శూన్యం'.. అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఇటీవల ఆయన పొదలకూరులో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైకాపా తీరుపై ధ్వజమెత్తారు. కమిషన్లు దండుకోవడం, ప్రజల సొత్తు లూటీ చేయడం వంటివాటిపైనే వైకాపా దృష్టి పెట్టి వ్యవస్థలను కుప్పకూల్చిందని ఆయన మండిపడ్డారు. అనంతరం ఆయన ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. అక్కడి పరిస్థితులు దయనీయంగా ఉండడంపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఎం కానీ, మంత్రులు కానీ ఏనాడైనా శాఖల వారీగా సమీక్షలు పెట్టారా?....ఏ రోజైనా సచివాలయం వెళ్లారా? మంత్రులుగా వెలగబెట్టినవారికి వారి శాఖలపై కనీస అవగాహన ఉందా?.. అని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక, ఇప్పుడు ఈ అయిదేళ్ళ తర్వాత ఇంటర్ విద్యార్థులకు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠ్యపుస్తకాల పంపిణీ జరగడం సంతోషకరమన్నారు. అనంతరం, పొదలకూరులోని శ్రీ వీర అభయాంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి, హనుమజ్జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. మహిమాన్వితులైన శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతో రాష్ట్రమంతా బాగుండాలని కోరుకున్నానని ఆయన చెప్పారు. శ్రీశైలం జలాశయానికి 4.30 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటం శుభపరిణామమని, డెడ్ స్టోరేజీలో ఉన్న సోమశిల, కండలేరు జలాశయాలకు నీరు విడుదల చేయాలని మూడు రోజుల క్రితమే తాను మంత్రి రామానాయుడుని కోరానని తెలిపారు. ఆమేరకు త్వరలోనే ఆ రెండు జలాశయాలకు కృష్ణా జలాలు చేరనున్నాయని తెలిపారు.

### డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

**--- మంత్రి సత్యకుమార్‌కు సోమిరెడ్డి లేఖ ---**

పొదలకూరు, మనుబోలుతో పాటు రాపూరు, కలువాయి, చేజర్ల, సైదాపురం మండలాల పరిధిలో డయాలసిస్ బాధితులు ఉన్నారని, వారంతా ప్రస్తుతం వ్యయప్రయాసలు పడి నెల్లూరుకు వెళ్లాల్సివస్తోందని, ఆరు మండలాలకు కూడలి అయిన పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఎంతో అవసరమని సోమిరెడ్డి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు లేఖ రాశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3.80కోట్లతో పొదలకూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సకల వసతులతో నిర్మించామని, ఆ సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నాయన్నారు. అదేవిధంగా, నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల హౌస్ సర్జన్ల సేవలను ఎస్పీఎం విభాగం ద్వారా పొదలకూరు సీహెచ్‌సీకి కూడా విస్తరించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో..

# కోవూరు బాలికల హాస్టల్‌లో వెలుగులు

- విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇన్వర్టర్ వితరణ



**'నేను మీపై పెత్తనం చేయడానికి వచ్చిన నాయకురాలిని కాదు, మీకు సేవ చేయడానికి వచ్చిన సేవకురాలిని' అని ఎన్నికల ప్రచారం సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పిన మాటలు, కోవూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఆమె అక్షరాలా ఆచరణలో పెడుతున్నారు. ఎన్నికలలో ఆమె ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసేందుకు అడుగులేస్తున్నారు.**

ఇటీవల విద్యా కిట్ల పంపిణీ సందర్భంగా కోవూరు నియోజకవర్గ కేంద్రంలోని బాలికల పాఠశాలకు ఆమె వెళ్ళగా, కరెంటు పోయినప్పుడు చదువుకోవడానికి తమకు సమస్యగా వుందని హాస్టల్ విద్యార్థినులు ఆమెకు చెప్పారు. ఇన్వెర్టర్ సదుపాయం ఏర్పాటు చేయమని మొరపెట్టుకున్నారు. అసలే వానాకాలం, పవర్ కట్ సహజం. పైగా ఆ హాస్టళ్ళలో ఉండేది నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు. వారి సమస్య వినగానే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తమ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా వెంటనే హాస్టల్‌లో ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించడం, స్థానిక టిడిపి నాయకులు మల్లారెడ్డి పర్యవేక్షణలో తెల్లారేసరికల్లా హాస్టల్ ఇన్వెర్టర్ బిగించడంతో హాస్టల్ బాలికల సంతోషం అంతాఇంతా కాదు. కోరిన వెంటనే తమకు ఇన్వెర్టర్ అందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మకు హాస్టల్ విద్యార్థినులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే చొరవను అభినందిస్తూ.. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలని ప్రశంసించారు.

## శ్రీసిటీ 'ఆక్సిలెంట్ ఫార్మా'కు..అరుదైన గుర్తింపు

శ్రీసిటీ పారిశ్రామిక సముదాయంలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పరిశ్రమకు యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్‌డీఏ) నుండి ప్రతిష్టాత్మకమైన మొదటి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (ఇఐఆర్) సర్టిఫికెట్ లభించింది. తమ పరిశ్రమ ఈ సర్టిఫికెట్ పొందడం సంతోషంగా ఉందని ఆక్సిలెంట్ ఫార్మా సహ-వ్యవస్థాపకుడు, ఛైర్మెన్ జితేష్ దేవేంద్ర తెలిపారు. తమ ఓరల్ డ్రగ్ ఉత్పత్తులకు సంబంధించి ఈ తనిఖీలు జరుగగా, రానున్న మరో 12 నెలల సమయంలో తమ ఇతర ఉత్పత్తులకు సంబంధించి యుఎస్ ఎఫ్‌డీఏ తనిఖీలు చేపడుతుందని కూడా ఆయన తెలిపారు.




## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చేనేత కార్మికులను ఆదుకోవాలి



చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేసి, ఆర్డీవో కిరణ్‌కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. నాయకులు కాలేషా, కుమార్, చంద్రయ్య, నారాయణ, భాస్కర్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకి గొడుగులు




రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ యస్.వి.ఆశోకచక్రవర్తి తన మనుమరాలు రిడ్డీ పుట్టినరోజు సందర్భంగా ఇటీవల గూడూరు, నరసింగరావుపేటలోని బాలసదన్‌లోని చిన్నారులకు విందు భోజనం వడ్డించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లలకు గొడుగులు బహుకరించారు. అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ పి.వి.కృష్ణయ్య, దశరథరామిరెడ్డి, ముని గిరీష్‌లు అశోక్‌కు ధన్య వాదాలు తెలిపారు. అనంతరం పిల్లల చేత కేక్ కట్టింగ్ చేయించారు. గోపాల్‌నాయుడు, బాలకృష్ణం రాజు, కిరణ్‌చక్రవర్తి, రవీంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో శిక్షా సప్తాహ్



గూడూరు, గాంధీనగర్‌లోని బాలికల ఎస్టీ మినీ గురుకులంలో గత వారం రోజులుగా జరిగిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా 'శుభదిన్' భోజన కార్యక్రమం నిర్వహించారు. జులై నెలలో జన్మించిన తొమ్మిది మంది విద్యార్థులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే విద్యాంజలి కార్యక్రమానికి ఎన్జీవోలను భాగస్వాములుగా చేయడం, అందులో భాగంగా శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్‌ని ఘనంగా సన్మానం జరిగింది. ఐటిడిఏ ఎఎంఓ శాంతికుమారి, జిసిడిఓ శాంతి, మినీ గురుకులం హెచ్‌ఎం మేరీ ప్రియత, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఫలసరుకుల పంపిణీ



గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ దాతృత్వంతో జులై 28న పేదలు, వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఎన్‌బికెఆర్‌లో కార్గిల్ విజయ్ దివాస్

కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆర్మీ, నేవీ, ఎన్‌సిసి క్యాడెట్లు ఉత్సాహంగా భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పాతికేళ్ళ కిందట కార్గిల్ లో భారత సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్‌ను ఓడించారని కొనియాడారు. అత్యంత కఠిన పరిస్థితులల్లో కూడా సైన్యాన్ని ఎదిరించి కార్గిల్‌ను తిరిగి స్వాధీనపరుచుకున్నారని అన్నారు. కార్గిల్ పోరాటంలో అమర సైనికులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు మనం ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. విద్యార్థులందరూ సైనికులను వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారిలాగా దేశానికి మంచిపేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ జి.మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి, ఎన్‌సిసి కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శ్రీసిటీలో అలరించిన..

# 'గజేంద్రమోక్షం' ప్రవచనం



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో జులై 27న శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం కథా ప్రవచన కార్యక్రమం అందరినీ అలరించింది. నెల్లూరుకు చెందిన అష్టావధాని బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్ ఈ కథకు తనదైన శైలి, ఆధ్యాత్మిక వివరణతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. లోతైన తాత్వికవిశ్లేషణలతో, అందమైన పోతన పద్యాలను శ్రావ్యంగా ఆలపిస్తూ రాజశేఖర్ కథా ప్రవచనాన్ని వినిపించారు. భగవంతుడి కరుణ మనపై కలగాలంటే, మన ప్రయత్నలోపం లేకుండా శ్రమించాలని, ఇక అసహాయులమనిపించినప్పుడు శరణాగతులమై ప్రార్థిస్తే తప్పక ఆ భగవంతుడు కాపాడతాడని ఆయన ఉద్బోధించారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరి మధు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కోట రాజశేఖర్ ఆధ్యాత్మిక విశ్లేషణలను కొనియాడారు. మనదేశంలోని గొప్ప ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో ఇటువంటి ప్రసంగాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం, శ్రీసిటీ శ్రీవాణి తరపున రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కోట రాజశేఖర్‌కు తన సందేశంలో కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రాంతంలో ఆధ్యాత్మిక సాహిత్య వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో శ్రీవాణి వేదిక ద్వారా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతుంటాయని ఆయన పేర్కొన్నారు.

# పన్ను చెల్లింపుదారులకు మంచి ఊరట - కేంద్ర బడ్జెట్

పదేళ్ళుగా దేశ ఆర్థిక బడ్జెట్‌లో చోటు దొరకాలనే ఎదురు చూపులు ఇప్పుడు ఫలించాయి. నవ్యాంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో శుభవార్త వినిపించింది. అప్పు రూపంలో గాని లేదా గ్రాంటు రూపంలో గాని నవ్యాంధ్ర రాజధాని అమరావతి కోసం 15,000కోట్లు విడుదల చేస్తాననడం గొప్ప ఆశావహ పరిణామం. అంతేకాక పోలవరాన్ని తామే నిర్మిస్తామని, అది జాతీయ ప్రాజెక్టు కావడంతో దానికి అండదండలందిస్తామని చెప్పడం కూడా ఆసక్తికరం. అంతేకాక, వెనుకబడిన జిల్లాలకు చేయూతనందిస్తామని చెప్పడం మరో విశేషం.

ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేసే ఉద్దేశ్యంతో కొత్తగా పనిలోకి వచ్చే యువత జీతభత్యాల్లో రూ.15,000/- వరకు మూడు వాయిదాల్లో తిరిగి ప్రభుత్వమే చెల్లిస్తుందని కూడా ప్రకటించడం హర్షణీయం. దీనివల్ల రెండు కోట్లమంది యువకులకు మేలు చేకూరుతుంది.

ఎటువంటి ప్రభుత్వ స్కీములు స్వీకరించక చదువులు కొనసాగించే యువత తీసుకొనే విద్యా ఋణాలపై 3% వడ్డీ రాయితీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం మీ వెనుక ఉంటుందని భరోసా కల్పించడం, కొంత బాధ్యతను ప్రభుత్వం స్వీకరించడం లాంటి ఉపయోగకర బడ్జెట్ ఆనందదాయకం. ప్రఖ్యాత కంపెనీలలో ఉద్యోగించే యువతకు ఆచరణాత్మకమైన శిక్షణ ఇప్పించే సరికొత్త పథకానికి రూపకల్పన చేయడం, ఆ శిక్షణ సమయంలో ఉపాకారవేతనం రూ.5,000/-లు ఇప్పించే కార్యక్రమం ఏర్పాటు చేయడం యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే అవుతుంది.

సూక్ష్మ, చిన్న, మధ్య తరగతుల పరిశ్రమలకు సంబంధించిన ఋణాలపై వ్యక్తిగత హామీని మినహాయించడం ఒక ఎత్తైతే, వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన సమయంలో మొండి బకాయిలకు ఆర్థిక భరోసా కల్పించడంద్వారా పరిశ్రమల అభివృద్ధిని ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్నట్లు తేటతెల్లమవుతుంది.

మరో మంచి విశేషం, ముద్రా ఋణాల పరిధిని 10 లక్షల నుంచి 20 లక్షలకు పెంచడమే కాక, ఆ ఋణాల చెల్లింపుదార్లకే వాటి వర్తింపజేయడం మొండి బాకీలకు కళ్ళెం వేయడమే అవుతుంది.

ప్రత్యక్ష పన్నుల సరళీకరణ ఎప్పటి నుంచో మరుగునపడిన అంశం. ఈ సరళీకరణ కార్యరూపం దాల్చే విధంగా వచ్చే ఆరు నెలల్లో ప్రణాళిక తీసుకొస్తామని బడ్జెట్‌లో హామీ ఇవ్వడం పన్ను చెల్లింపుదారులకు ఊరటకల్గించే విషయంగా పేర్కొనవచ్చు.

పన్ను ఎగవేతదారులకు అడ్డుకట్ట వేసే ఆలోచనతో టిడిఎస్ పరిధిని విస్తృతంగా పెంచుతూ వస్తుంది కేంద్ర ప్రభుత్వం. అయితే, 5శాతం శ్లాబులో ఉండే వారిని 2 శాతానికి తగ్గించడం ద్వారా వ్యాపారులకు కొంతమేర ద్రవ్యలోటును తగ్గించే వైపు అడుగులు వేసింది.

అయితే, భాగస్వామ్య సంస్థలలో భాగస్వామికి ఇచ్చే వేతనంపై టిడిఎస్ చేయడం కొంచెం జీర్ణించుకోలేని అంశం.

గడచిన 5 ఏళ్ళలో 5లక్షల నుండి 15 లక్షలలోపు ఆదాయం ఉండేవారు 49శాతం మేర ప్రత్యక్ష పన్నుల వసూళ్ళలో భాగస్వాములుగా మారారు. అయితే, వీరికి ప్రభుత్వం ప్రకటించిన రాయితీ మాత్రం కంటితుడుపు చర్యగా ఉండడం బాధాకరం. ఆర్థిక ద్రవ్యోల్బణంతో సంబంధం లేకుండా ఇచ్చిన రాయితీల వల్ల ఎటువంటి ప్రయోజనం చేకూరకుండా పోయింది.

ప్రభుత్వం రూపొందించిన కొత్త స్కీము ప్రకారం 3లక్షల వరకు ఆదాయపు పన్ను లేకుండా, 3లక్షల పైనుండి 7 లక్షల వరకు 5 శాతం, ఏడు లక్షల పైనుండి 10 లక్షల లోపు వరకు 10 శాతం, పదిలక్షల పైనుండి 12 లక్షలలోపు 15 శాతం, 12 లక్షల పైనుండి 15 లక్షల లోపు 20 శాతం, 15 లక్షలపైన 30 శాతంగా నిర్ణయించడం జరిగింది.

మూలధన ఆదాయం (క్యాపిటల్ గెయిన్స్) క్రింద ఉండే అసమానతలను తొలగించే విధంగా అడుగులు ముందుకు వేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. ప్రభుత్వం ప్రకటించిన కొత్త స్కీము లోని వేతనదారులకు ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) 50వేల నుంచి 75 వేలకు పెంచడం పెద్ద ఊరటగా పేర్కొనవచ్చు.

మొత్తానికి పన్ను చెల్లింపుదారులకు కాసింత ఊరట కల్గే విధంగా రూపొందించిన మన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందనీయురాలుగా చెప్పవచ్చు.



**- చిన్ని శ్రావణ్‌కుమార్**
చార్టర్డ్ అకౌంటెంట్

### ధూర్జటి కవితా మాధుర్యానికి..

# ఈశ్వర భక్తే కారణం

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవ రాయల భువనవిజయంలోని అష్టదిగ్గజ కవులలో ఒకరైన ధూర్జటి కవితా మాధుర్యానికి కారణం, ఆయనకు ఈశ్వరునిపై ఉన్న భక్తి ప్రపత్తులేనని నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ గిరిజాలక్ష్మి పేర్కొన్నారు. చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో టౌన్‌హాల్ ఆవరణలోని రీడింగ్‌రూమ్‌లో జులై28న జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని 'ధూర్జటి కవితా మాధుర్యం' అనే అంశంపై ఉపన్యసించారు. సభకు పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కాళిదాసు పురుషోత్తం ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ధూర్జటి రచించిన 'శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము' గురించి వివరించారు. అనంతరం ఆమెను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశం, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కోఆర్డినేటర్ ఎన్.బలరామయ్యనాయుడు, కప్పర హరేంద్ర వరప్రసాద్, సుబ్బారాయుడు, దుర్గా మురళీకృష్ణ, శ్రీలక్ష్మి, బృందావనరావు పాల్గొన్నారు.

# వికృతరూపం దాలుస్తున్న ప్రకృతి

## కేరళను కన్నీట ముంచిన జల విలయం



పశ్చిమ కనుమల ఒడిలో కనుచూపు మేరా పచ్చదనంతో కనువిందు చేసే కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపించింది. కొండచరియలు విరిగిపడి వంద మందికి పైగా మరణించారు. ఈ జిల్లాలోని ముందక్కై, మెప్పాడి, చూరల్‌మల ప్రాంతాల్లో భారీగా వరదలు వచ్చాయి. ఫలితంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మట్టిపెళ్లలతో కూడిన కొండ చరియలు విరిగి పడడంతో వరదనీటితో అవి కలిసిపోయి బురద ప్రవాహం పోటెత్తింది. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. కడపటి వార్తలు అందేసరికి 143 మంది మరణించారు. దాదాపు 200 మంది గాయపడ్డారు. ఇక్కడి తేయాకు తోటల్లో పని చేయడానికి అసోం, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 600 మంది కూలీల ఆచూకీ లభించడం లేదు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విపత్తు నిర్వహణ సిబ్బంది, త్రివిధ దళాల సిబ్బంది రక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు.

### తప్పించుకోలేరా?

కేరళలో కొండచరియలు విరిగిపడే సంఘటనలు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి. దీంతో వేలమంది జీవితం అతలాకుతలమవుతోంది. వందల మంది మరణించడంతో పాటు నివాసాలు, పశువులు కొట్టుకుపోయి పేదలు జీవనాధారం కోల్పోతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి తారుమారవుతోంది. తుఫానులు, సాధారణ వరదల ముప్పును ముందు అంచనా వేయడానికి, గమనించి హెచ్చరికలు జారీ చేయడానికి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి తగినంత సమయం దొరుకుతుంది. కొండ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చినప్పుడు హెచ్చరికలు జారీ చేయడానికి, కొండవాలు కిందనే ఉండే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి తగిన సమయం దొరకడం కష్టం. అందుకే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోంది. పైగా కొండ ప్రాంతాలు పూర్తిగా బండలతో కాకుండా మట్టిపాళ్లు ఎక్కువగా ఉంటే మట్టి కరిగిపోయి పెద్ద పెద్ద పెళ్లలు వాలుగా జారిపోతుంటాయి. అదంతా చిక్కటి బురదగా మారిపోయి మరింత నష్టానికి కారణ మవుతుంది. కొండచరియలు విరిగిపడి రాళ్లు దొర్లేటప్పుడు లేదా బురదతో కూడిన పెళ్లలు జారిపోయేటప్పుడు అవి మనిషి పరుగెత్తగలిగే వేగం కంటే ఎక్కువ వేగంతో జారతాయి. అందుకే ప్రాణనష్టం ఎక్కువగా వాటిల్లుతుంది. అందులోనూ అర్ధరాత్రి ఆకస్మిక వరద విరుచుకుపడితే తప్పించుకోవడం మరింత కష్టమవుతుంది. ఇలాంటి సంఘటనల్లో చనిపోవడానికి బురదలో చిక్కుకుపోవడం లేదంటే ఊపిరాడకపోవడమే ప్రధాన కారణం.

### ప్రకృతి విపత్తా? మనిషి చేస్తున్న తప్పా?

మొరంలాంటి మట్టితో బాగా వాలుగా ఉన్న కొండలపై పెద్ద ఎత్తున వర్షం పడడమే కేరళలో కొండచరియలు విరిగిపడ డానికి ప్రధాన కారణం. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాత రీతిలో అసహజమార్పుల వల్ల ఆకస్మికంగా కుండపోత వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి ఆకస్మిక కుండపోత వర్షాలు కొండవాలులు ఎక్కువగా ఉండే కేరళలో భారీ నష్టాన్ని కలుగ చేస్తున్నాయి. 2018 ఆగస్టులో ఇదే జరిగింది. ఈ రాష్ట్రంలో ఆ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 19 మధ్య సాధారణం కన్నా 42శాతం ఎక్కువగా వర్షం కురిసింది. దీంతో పెద్దఎత్తున వరద పోటెత్తింది. ఆగస్టు 16న కొండచరియలు విరిగిపడడం వల్ల 450 మందికిపైగా మరణిం చారు. పెద్దఎత్తున ఆస్తినష్టం సంభవించింది. పది జిల్లాల్లో దాదాపు 340 కొండచరియలు విరిగిపడ్డాయి. ఇందులో ఒక్క ఇడుక్కి జిల్లాలోనే 143 కొండచరియలు విరిగిపడ్డాయి. బాగా వర్షాలు పడినప్పుడు ఉపరి తలం అడుగున మట్టిలో నీరు పెద్దఎత్తున చేరి ప్రవాహమార్గాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఈ ప్రవాహమార్గం బాగా పెరిగి, పెరిగి అది బయటకు వెళ్లే మార్గంలేక పెద్ద పెద్ద కొండ వాలులను పెకలించుకుంటూ బయట పడుతుంది. ఆ మట్టంతా ఆ నీళల్లో కరుగుతూ వాలు వెంబడి కిందకు దూకుతుంది. చెట్ల వేళ్లు మట్టిని బాగా బంధించి ఉంచుతాయి. అయితే ఇటీవల బాగా పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా కొండప్రాంతవాలు లను, అటవీ ప్రాంతాలను కొట్టేసి భారీ ఎత్తున నిర్మాణాలు చేపడుతు న్నారు. దీంతో చెట్లు మాయమైపోయి కొండప్రాంత సహజస్వభావం మారిపోతోంది. మట్టిలోని బిగువు పోతోంది. ఫలితంగా సహజప్రవాహ మార్గం అదృశ్యమై కొత్త ప్రవాహమార్గాలు ఏర్పడుతున్నాయి. దీంతో కొండవాలులో అస్థిరత ఏర్పడి చరియలు విరిగిపడుతున్నాయి. "మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాష్ట్రంలో మరిన్ని రహదారులు, కల్వ ర్టులు నిర్మిస్తున్నారు. అయితే పాత రోజుల్లో వర్షపాత లెక్కల ఆధారంగానే ఇప్పుడూ ఇంజినీరింగ్ స్ట్రక్చర్లు ఉంటున్నాయి. ఇప్పటి ముప్పును దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టడం లేదు. చాలా ప్రాంతాల్లో వరద ప్రవాహా నికి తగినంత అవకాశం ఇవ్వడం లేదు. అశాస్త్రీయ రీతిలో చేపడుతున్న నిర్మాణప్రక్రియలే ఇటువంటి విపత్తులకు కారణం" అని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకుమార్ చెప్పారు. ప్రకృతి సహజ విలయాన్ని ఎవరూ ఆపలేరు. కానీ మానవ తప్పిదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రకృతిని నాశనం చేసే మానవజోక్యాన్ని అడ్డుకునేలా ప్రభుత్వ విధానాలను రూపొందిం చుకుని కఠినంగా అమలు చేస్తే ఇలాంటి విపత్తులను తగ్గించుకోవచ్చు.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**

---



## జానకిరామ.. రామాయణం (24)

- ఊటుకూరు జానకి రామారావు

అభిషేక సామాగ్రికి శ్రద్ధాపూర్వకమైన దృష్టితో ప్రదక్షిణం చేసి మెల్లగా వెళ్ళాడు రాముడు!

రాముడి సౌందర్యాన్ని, ముఖకాంతిని ఏ మాత్రం తగ్గించలేక పోయింది పినతల్లి కోరిక! సుఖదుఃఖాలకు అతీతుడైన యోగిలాగ ఏ విధమైన చిత్తవికారం లేకుండా తల్లి మందిరం వైపుగా సాగిపోయాడు!

రాజ లాంఛనాలన్నీ అక్కడనే వదిలివేశాడు!

మానసికంగా ఆయన అరణ్యంలోనే ఉన్నట్లుగా అయిపోయాడు!

పొంగిపొరలే దుఃఖాన్ని మనసులోనే అణిచివేశాడు! ఇంద్రియాలను పూర్తిగా తన అధీనంలో ఉంచుకొన్నాడు!

తనను కలువ వచ్చిన పౌరులను, మిత్రులను పంపివేశాడు!. వారెవరికీ కూడా రామునిలో ఏ విధమైన మార్పు కనపడలేదు!

తన సహజసిద్ధమైన స్మితభాషణాన్ని విడువలేదు!

అదే ప్రియభాషణం! అదే మృదుత్వం! అదే నవ్వు!

అదే ప్రశాంతవదనం!

రాముడు కౌసల్యా మందిరంలో అడుగుపెడుతున్నాడు!

ఆ మందిరమంతా కోలాహలం! సంతోషం!

తన మనసులోని భావాలు రవ్వంత కూడా కనపడనీయలేదు రాముడు!

కౌసల్య ఆ సమయంలో మంగళకరమైన వేషధారణతో అగ్నిలో హోమం చేస్తున్నది. ఆ సమయంలో రాముడచటికి వచ్చి దేవతాస్త్రీ వలే ప్రకాశించే తల్లికి పాదాభివందనం చేశాడు!

అప్పుడామె రాముని కౌగలించుకొని శిరస్సుపై వాసనచూసి, నాయనా నీకు శుభమగుగాక, నీతండ్రి మాట తప్పడు.. నేడే నీ పట్టాభిషేకం! నీ వంశ ధర్మాన్ని చక్కగా పాలించు తండ్రీ అని పలికింది!

నాయనా రా! భోజనం చేద్దువుగాని! అని పలికిన తల్లి పలుకులకు రాముడు, అమ్మా నేటినుండీ నేను కందమూల ఫలములు తినవలసి యున్నది, ఈ రాజాసనములు విడిచి దర్భాసనములపై కూర్చొనవలె! ఈ రాజప్రాసాదాలు, నగరాలు విడిచి జనశూన్యమైన అడవులలో తిరుగాడవలె! భరతునకు రాజ్యమీయవలె! ఇది తండ్రిగారి ఆజ్ఞ!

రాముని మాటలకు .. ఒకేవేటుకు నేలకూలిన సాలవృక్షంలాగ, స్వర్గంనుండి భూపతనమైన దేవతలాగా ఒక్కసారిగా దబ్బున నేలపై బడింది కౌసల్య!

నేలపైబడిన తల్లిని లేపి పొదివిపట్టుకొని తల్లి కన్నీరు తుడిచాడు రాఘవుడు!

రామా! నీవు నాకు పుట్టకపోయినా బాగుండేదిరా... నాయనా ఈ శోకం తప్పేది! నాకు దుఃఖం కలిగించటానికే పుట్టావు నాయనా నీవు. గొడ్రాలికి ఒకటే శోకం! పిల్లలులేరే అని!

మీ తండ్రి గారి ఏలుబడిలో నేను ఏ మంగళముగానీ, సుఖముగానీ ఎరుగను.. నీ అధికారంలో అవి అనుభవించవచ్చులే అని నా ఆశ!.

నాకేం తక్కువ? అయినా సవతులచేత మాటలుపడ్డాను. కైక పెట్టిన అవమానాలు భరించాను, ఆవిడ మాటలు విని నీ తండ్రి నన్ను చిన్నచూపు చూసినా అన్నీ నీవున్నావులే అనే ఆశతో సహించాను! ఓపిక పట్టాను! ఇక ముందు నా గతి ఏమి కాను? భరతుని చూసి భయంతో అందరూ నన్ను కనీసం పలకరించనైనా పలకరించరు!

రామా ఈ వార్త విని నా గుండె బ్రద్దలవటం లేదేమిరా, ఇంత రాయి అయినదేమిరా నాయనా ఇది!. నాకు యమలోకంలో కూడా చోటులేదు! అని అంటూ కొడుకుకు కలిగిన కష్టాన్ని తలుచుకుంటూ పరిపరి విధాలుగా రోదించి రోదించి కంట కన్నీరు కూడా ఇంకి పోయిందామెకు!.

పెత్తల్లి రోదనలు వింటున్న లక్ష్మణుడు దీనంగా, అన్నా! ఒక ఆడుదాని మాటకు గౌరవమిచ్చి నీవు అడవులకు వెళ్ళటమెందుకు?

ముసలివాడైన రాజుకు ఇంకా కోరిక చావక కామంతో కళ్ళు మూసుకుపోయి అనాలోచితంగా అనుచితమైన కోరిక కోరాడు.

బుద్ధిగలవాడెవడైనా సద్గుణాలప్రోవు అయిన కుమారుడిని పోగొట్టుకుంటాడా! మతిభ్రమించిన రాజాజ్ఞను నీవు పాటించనక్కరలేదు!.

అన్నా పద! ఇప్పుడే ఈ క్షణమే ఈ రాజ్యాన్ని మనం చేజిక్కించు కుందాం! రాజా! బూజా! తరాజా! ఎవడైనేమి? వాడి అంతు చూద్దాం! అవసరమైతే బుద్ధిలేని రాజును వధించనైనా వధిస్తాను.

భరతుడి పక్షం వారెవరెవరైనా అడ్డువస్తే చీల్చి చెండాడతాను! అనుజ్ఞ ఇవ్వన్నా! ఏ బలం చూసుకొని రాజు నీతో వైరం పెట్టు కున్నాడు... ఎదిరించి నిలువగలడనేనా?

నా ధనుస్సుమీద, సత్యం మీద, నేను చేసిన దానయజ్ఞాల మీద అవిచ్చిన ఫలాల మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను... రాముడు అగ్నిలో దూకాల్సివస్తే ఆయన కన్నా ముందే దూకుతాను. రాముని కష్టాన్ని తొలగించలేని నా పరాక్రమం బూడిదలో పోయటానికా!

తీవ్రమైన ఆగ్రహావేశాలతో కన్నుల నుండి విస్ఫులింగాలు రాలుతున్నాయి. ముఖం కందగడ్డలా మారిపోయింది! క్రోధంతో ఊగిపోతున్నాడు లక్ష్మణుడు.

కానీ ఆయన క్రోధ సముద్రం రాముడు అనే చెలియలికట్ట దాటలేకుంది!.

లక్ష్మణుడి వీరాలాపాలు విని ధైర్యం తెచ్చుకొన్న కౌసల్య రామునితో, నాయనా లక్ష్మణుని మాటలు విన్నావుగా నీకిష్టమైనచో ఈ విషయమున చేయదగిన పనులు చేయి అని పలికింది.

నా సవతి మాటలు ధర్మవిరుద్ధం, న్యాయవిరుద్ధం! ఆ మాటలు



పట్టుకొని నీవు నన్ను వదలి అడవుల పాలవుతావా నాయనా! వద్దు, వద్దు. నీవిచ్చుటనే నాకు శుశ్రూష చేస్తూ ఉండు! నీవు అరణ్యమునకు వెళ్ళుటకు నా అనుమతి నీకు లేదు! నాకు ప్రాణత్యాగమే శరణ్యం!

దీనంగా పలుకుతున్న తల్లిని చూసి రాముడు! అమ్మా! తండ్రి ఆజ్ఞను ధిక్కరించే సాహసం నేను చేయలేను, అంత సామర్థ్యమూ నాకు లేదు!

అమ్మా! నా తండ్రి ఆజ్ఞ నాకు శిరోధార్యం.. అదే నా వ్రతం! తండ్రి ఆజ్ఞ పాటించిన వారెవరికీ ఎటువంటి దోషం కలుగదు! అని తల్లితో పలికి లక్ష్మణుని వైపు తిరిగి లక్ష్మణా నీ బలం, తేజస్సు, నేను ఎరుగుదును! అమ్మకు ధర్మం యొక్క రహస్యం తెలియక అంత బేల అయినది! లోకంలో అన్నిటికన్నా శ్రేష్టమైనది ధర్మమే! ఆ ధర్మంలోనే సత్యమున్నది. మన తండ్రి చెప్పిన వచనములన్నీ ధర్మాశ్రయములే, అందులో నిస్సంశయముగా ఏ దోషమూలేదు!

నేను తండ్రి ఆజ్ఞను అతిక్రమించజాలను!

క్షత్రియ ధర్మంలోని ఈ చెడు ఆలోచన నీవు విడువు! క్రౌర్యం వలదు! ధర్మమును శరణువేడు!. నా ఆలోచనను అనుసరించు!.

రాముని వదనంలో ఏ విధమైన వ్యాకులత గానీ తొట్రుపాటు గానీ లేవు, కేవలం ధర్మాచరణమే లక్ష్యంగా మాటలు చెపుతున్నాడు. రవ్వంత వికారము కూడా లేదు!

రాముడి వన గమనమునకు కౌసల్య అనుమతించటంలేదు. తల్లిని సమాధాన పరుచట ఇప్పుడు ఆయన కర్తవ్యం!

అమ్మా! నీవు, నేను, లక్ష్మణుడు, సుమిత్రామాత అందరమూ తండ్రిగారి ఆజ్ఞకు బద్ధులం కావలసినదే! అది సనాతన ధర్మం!.

నాయనా! నీ తండ్రి వలే నేను కూడా నీకు గురు స్థానములో ఉన్నాను, కావున నీకు అనుజ్ఞ ఇవ్వను అని పలుకుతున్న తల్లిని, ఆవిడకు అండగా నిలచిన లక్ష్మణుని చూసి...

.. (సశేషం)

# గత ప్రభుత్వ సిత్రాలంటూ... బాబు శ్వేతపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి, పోలవరం, మద్యం, విద్యుత్, అప్పులు, భూ అక్రమాలు, శాంతిభద్రతలు... ఇలా పలు కీలకమైన అంశాలకు సంబంధించి ముఖ్యమంత్రి శ్వేతపత్రాలు విడుదల చేశారు. విడుదలైతే చేశారు గానీ... ఆయా సమస్యల విషయంలో ఆయన ఏం చేయదలచుకున్నారన్నది మాత్రం స్పష్టంగా చెప్పలేదు. రాష్ట్ర విభజన తరువాత పెనం మీద ఉన్న ఆంధ్ర పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. ఆ తరువాత 2019 ఎన్నికలలో పొయ్యిలో నుండి అగ్నిగుండంలో పడిపోయింది. ఇప్పుడు 2024 ఎన్నికల తరువాత రాష్ట్రం మళ్ళీ పెనం మీదకి వచ్చిందన్న భ్రమలో ఆంధ్రులు ఉన్నారు. వారి ఆలోచనకి తోడు చంద్రబాబు సైతం పాత బాబును చూస్తారు, అభివృద్ధితో అద్భుతాలు సృష్టిస్తాను అంటూ చెప్పటం ప్రజల ఆశలని, ఆకాంక్షల్ని మరింతగా పెంచింది. బిడ్డలు రాష్ట్రం, దేశం దాటి ఉపాధి వెతుక్కుంటూ వెళితే ఏ తల్లిదండ్రులైనా బాధపడటం సహజం. మళ్లీ మనదగ్గరే అవకాశాలు వస్తే, వాళ్ళు తిరిగి వచ్చి, తమకు అండగా నిలబడతారన్నది అమ్మానాన్నల విశ్వాసం. ఈ దిశగా ప్రస్తుత ప్రభుత్వం ఏం చేయబోతోందన్న స్పష్టతని మాత్రం నేటి ప్రభుత్వ పెద్దలు ఇవ్వలేకపోతున్నారు.

ఒక్కసారి పాతికేళ్ళు వెనక్కివెళ్ళి చూసుకుంటే, నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సాధించిన విజయాలు బహుశా ఈతరం యువతకు తెలియకపోవచ్చు. కానీ, ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువతలో ఆత్మవిశ్వాసం నింపేందుకు బాబు చేసిన కృషి సాధారణమైంది కాదు. ప్రతి విషయాన్ని పాతికేళ్ళ ముందుగా ఆలోచించే ఆయన పుణ్యమాని ఈరోజు ఎంతోమంది తెలుగువారు విదేశాల్లో శాసించే స్థాయిలో ఉన్నారు. దీనికి కారణం మొత్తం ఆయన అని చెప్పలేము కానీ, పునాది వేసింది మాత్రం ఆయనేనని చెప్పాలి. ఈ క్రమంలో పాత బాబును మళ్లీ చూస్తారన్న ఆయన మాటలు పెద్దవారితో పాటు, యువతలోనూ ఆశల్ని పెంచాయి. ఎందుకంటే ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని ఏలుతోంది. బాబు నైపుణ్యాభివృద్ధిలో ఆ తరహా కొత్త అవకాశాల సృష్టి ఏదైనా జరుగుతుందేమో అన్న ఆశ అందరిలోనూ వ్యక్తమవుతోంది.

చంద్రబాబుని జనం “కల్కి” స్థాయిలో ఊహించుకుంటే... ఆయన మాత్రం ఇంకా “రాధేశ్యామ్” లాగా లెక్కలు చెబుతూ కాలయాపన చేయటం చాలామందికి నచ్చటం లేదు. అసలు ఎన్నికలకు ముందు బాబు వేగాన్ని చూసిన జనమంతా ఆయన అప్పటికే, అన్ని విషయాల్లో ఓ నిర్ణయానికి వచ్చేశారు, అందుకే అంత విశ్వాసంతో మాట్లాడుతున్నారు అనుకున్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ వేగం కనిపించటం లేదని పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం చెబుతోంది నిజమే... రెండు నెలల్లో అద్భుతాలు జరగవు. ఐదేళ్ళ విధ్వంసానికి రెండు నెలల్లో పరిష్కారాలు రావు. అయితే, చంద్రబాబు లాంటి ముఖ్యమంత్రి నుంచి ప్రజలు సత్వర పరిష్కారాలు ఆశించటంలో తప్పులేదు. ఆయన అసలు విషయం పక్కన బెట్టి మళ్ళీ మళ్ళీ గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఎత్తి చూపడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

## లెక్కలు, పద్దులతోనే పొద్దు గడిపేస్తున్నారు!

ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రాల్లో 20 నుంచి 30 శాతం మాత్రమే కొత్త విషయాలు. అందులో మరో 30శాతం విషయాలు గత ప్రభుత్వంలోని మంత్రులు అమాయకత్వంతోనో, నోటి దురదతోనో బయటపెట్టుకున్నవే. ఒకాయన గుడ్డు పొదగాలంటారు, ఇంకొకాయన మంత్రి అయినంత మాత్రాన సమాధానం చెప్పాలా అంటాడు, ఇంకొకరేమో తమ పరిధిని వదిలి వేరే అంశాలే మాట్లాడనంటారు. మరొకరైతే మీసం మెలేయటాలతోనే కాలం గడిపేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు మళ్ళీ బాబుకే అవకాశం ఇచ్చారు. ఆయన నుంచి ప్రజలు కోరుకుంటుంది లెక్కలు, పద్దులు కాదు... స్పష్టమైన అభివృద్ధి. ఈ పరిస్థితుల్లో శ్వేతపత్రాలతో కాలయాపన చేయడం మంచిది కాదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

## ఇదే మంచి తరుణం!

గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పటి ప్రభుత్వానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో అత్యంత కీలకంగా ఆంధ్రప్రదేశ్ వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి ప్రజలు అధికంగా ఆశించడంలో ఎలాంటి తప్పు లేదు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఇటీవల బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు తెచ్చుకుని ముఖ్యమంత్రి తన చాణక్యాన్ని చాటి చెప్పారు. మంత్రి పదవులు పెద్దగా ఆశించకుండా, నిధుల మీదే దృష్టిపెట్టి విజయం సాధించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా, భవిష్యత్ ఏంటి అనే అనుమానాలకు ఇంకా సమాధానం లభించడం లేదు. మోడీ నుంచి నిధులు రాబట్టడం అంటే సాధారణమైన విషయం కాదు. గతంలో జగన్ చేసిన తప్పిదం ఇదే. తన కేసులనుండి తప్పించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. అంతేకానీ నిధులు, కొత్త ప్రాజెక్టులు, ప్రత్యేకహోదా వంటివి సాధించుకోవటంలో వెనుకబడ్డారు. కానీ, ఇప్పుడు పరిస్థితి అలాలేదు. కేంద్ర ప్రభుత్వ మెజారిటీ మన మీదే ఆధారపడి ఉంది. సాధించుకోవటానికి అవకాశాలు మెండుగా, దండిగా ఉన్నాయి. అన్నిటికీ ఇదే మంచి తరుణం.

## ప్రత్యేకహోదా జనానికి గుర్తు లేదు!

అన్నింటికీ మించి ప్రత్యేకహోదా అంశం గురించి ప్రజలు గుర్తుపెట్టుకోవటం మానేశారు. ప్రత్యేకహోదాకు మించిన అంశాలు చాలానే వున్నాయన్న విషయం వాళ్ళు గ్రహించారు. కాళ్ళు పట్టుకుని అయినా, కాలర్ పట్టుకుని అయినా ప్రత్యేకహోదా సాధిస్తామని అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఐదేళ్ళలో అసలా విషయం ఒకటి ఉందని కూడా గుర్తించలేదు. ప్రజలకు డబ్బులు పంచాం, గెలుస్తాం అనుకున్నారు గానీ... ప్రజలందరి ఆకాంక్ష డబ్బులు పంచటం కాదనే విషయాన్ని గమనించడంలో విఫలమయ్యారు. సరిగ్గా ఇదే టీడీపీకి బలంగా మారింది. సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకువెళతామంటూ వారు ఇచ్చిన హామీతో ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం ముందున్నది సంక్షేమాన్ని కొనసాగించటం, స్పష్టమైన అభివృద్ధిని సాధించటం.

ఈ నేపథ్యంలో ఇటీవల గుంతలు పడ్డ రోడ్లను పూడ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధమయ్యింది. వచ్చేది వర్షాకాలం గనుక తారు కంటే థర్మల్ కేంద్రాల నుంచి వచ్చే బూడిదతో పూడ్చాలని భావించి ఆదేశాలిచ్చింది. అయితే ఆ బూడిద ఎండిన తర్వాత రహదారులన్నీ ప్రమాదకరమైన దుమ్ముతో నిండిపోయి, అనేక సమస్యలు సృష్టించాయి. ఈ విషయంలో ఆలోచన మంచిదే అయినా, సత్ఫలితాలు ఇవ్వలేదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అనేక అగచాట్లు పడ్డారు. ఇలాంటి నిర్ణయాలు ప్రభుత్వం మీద నమ్మకాన్ని సన్నగిల్లేలా చేసే ప్రమాదాలు లేకపోలేదు.

## శ్వేతపత్రాలతో సమస్యలు తీరవు!

ఇప్పుడు శ్వేతపత్రాల ప్రయోగాన్ని కూడా ప్రజలు తిప్పికొట్టే ప్రమాదం ఉంది. తాము వద్దనుకున్న ప్రభుత్వం చేసిన తప్పులను, కావాలని గెలిపించిన ప్రభుత్వం చూపించటంలో ఆంతర్యం ఏమిటో అర్థం చేసుకునేంత సమయం ప్రజలకు లేదు. ఐదేళ్ళ నుంచి ప్రజలు ఎదురు చూస్తున్నది నిజమైన అభివృద్ధి, సంక్షేమం. ఆ దిశగా సాగే ఏ అడుగునైనా ప్రజలు అర్థం చేసుకోగలరు. పాత ప్రభుత్వ తప్పిదాలు ప్రజలకు ఇప్పుడు అనవసరమైన విషయాలు. ఎందుకంటే ఆ తప్పిదాలకు తగిన శాస్తి ప్రజలు చేసేశారు. ఇప్పుడు వాళ్ళకి కావలసింది ఎన్ని రోజుల్లో ఏ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఐదేళ్ళ నుంచి ఎక్కడికక్కడ ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటినుంచి పట్టాలు ఎక్కిస్తారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని మీరు ఏ విధంగా తీర్చిదిద్దుతారు. పోలవరం ఎప్పటికి పూర్తిచేస్తారు. రాజధాని ఎప్పటికి ఏర్పాటు చేస్తారు... ఇలా వందలాది ప్రశ్నలు, అనుమానాలు ప్రజల మనస్సులో మెదులుతున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టి, సంక్షేమ పథకాలను కొనసాగించి పాతికేళ్ళ క్రితం బాబుని మళ్ళీ చూపించగలిగితే ప్రజలు హర్షిస్తారు.

గత ప్రభుత్వం చేసిన విధ్వంసపు సిత్రాలని శ్వేతపత్రాలతో చూపించడం మానేసి, భవిష్యత్తులో రాష్ట్రంలో ఏం జరగబోతోందో రాజపత్రాలతో ప్రకటిస్తే ప్రజలు సంబరపడతారు!

# వనాలను సంరక్షిస్తా

### --- కొత్త రేంజర్ మాల్యాద్రి ---

నెల్లూరు రేంజ్ పరిధిలోని వనాలను, వన్య ప్రాణులను సంరక్షిస్తానని, అటవీ సంపదను కాపాడడమే కాక, అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా అటవీశాఖ ఇన్‌ఛార్జి రేంజర్‌గా జులై 31న పదవీబాధ్యతలు చేపట్టిన ఎస్.మాల్యాద్రి చెప్పారు. నెల్లూరు క్షేత్రస్థాయి రెగ్యులర్ రేంజర్‌గా ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్థానిక చంద్రమౌళినగర్‌లో ఉన్న నెల్లూరు అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అటవీశాఖ ఉన్నతాధికారుల సహకారంతో అటవీ అభివృద్ధికి, వనాల సంరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.



# తక్కువ ధరలకు సరుకులు

నెల్లూరులోని రైతుబజార్లు, రిటైల్ దుకాణాలలో సరసమైన ధరలతోనే నాణ్యమైన సరుకులను ప్రభుత్వం విక్రయిస్తుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఆగస్టు 1న, పౌర సరఫరా శాఖాధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆయన 'సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు'.. అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేజీ కందిపప్పు రూ.150లకి, స్టీమ్ బియ్యం 48 రూపాయలకి, పచ్చిబియ్యం రూ.47 చొప్పున ప్రజలకి విక్రయిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# జిల్లా ఎస్పీని కలిసిన..ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆగస్టు 1న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కోవూరు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్ వద్ద సెలవురోజుల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు కనుక అదనపు భద్రత.. తదితర అంశాలను చర్చించారు. కోవూరులో మహిళల సంరక్షణపై తక్షణమే స్పందించేలా కిందిస్థాయి పోలీసు అధికారులను ఆదేశించాలని, కోవూరు నియోజకవర్గ పరిధిలో రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని కోరారు. ఎస్పీని కలిసినవారిలో టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఉన్నారు.

# చిన్ననాటి జ్ఞాపకాలతో పులకింత

## గండవరంలో ఆత్మీయంగా పూర్వవిద్యార్థుల సమావేశం



మూడు దశాబ్దాల క్రితం నాటి మధుర జ్ఞాపకాలను, తాము అప్పట్లో బడిలో చదువుకుంటున్నప్పటి సంగతులను గుర్తుకుతెచ్చుకుంటూ ఆ పూర్వవిద్యార్థులు పులకించిపోయారు. దాదాపు 30ఏళ్ళ క్రితం, 1994-95విద్యా సంవత్సరం గండవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా ఇటీవల కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్న వారంతా జులై 28న పాఠశాలలో జరిగిన ఆ ఆత్మీయ సమావేశానికి తరలివచ్చారు. చిన్ననాటి స్నేహాలను తలచుకుంటూ మురిసిపోయారు. ఇన్నేళ్ళుగా విడిపోయిన వారంతా ఇప్పుడు ఎక్కడున్నారో ఒకరికొకరు తెలుసుకుని, వారి కుటుంబాల క్షేమసమాచారాల గురించి ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా చదువులు నేర్పిన నాటి గురువులు గున్నయ్య, రమణమూర్తి, చెంచురామయ్య, ప్రధానోపాధ్యాయులైన జి.శ్రీనివాసులు తదితరులను సాదరంగా ఆహ్వానించి, వారికి కృతజ్ఞతాపూర్వకంగా సన్మానాలు చేసి గురువందనం చేసుకున్నారు. తాము చదువుకున్న ఆ పాఠశాలకు తమ జ్ఞాపకంగా ఒక ప్రింటర్‌ను కూడా బహుకరించారు. ఆ రోజంతా చిన్ననాటి ముచ్చట్లతో గడిపారు. ఈ సమావేశం నిర్వహణకు సహకరించిన తమ మిత్రులు వి.సాగర్, ఎన్. శ్రీనివాసులు, టి.నరసింహులు, డి.సురేష్, బాల అంకుల్, ఆదిలక్ష్మి, శ్రీవిద్య తదితరులందరికీ పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

### కావలి జవహర్‌భారతిలో..

# వివిఎస్‌యు వీసీకి సన్మానం



కావలిలోని జవహర్‌భారతి డిగ్రీకళాశాలను విక్రమసింహపురి యూనివర్శిటీ (వివిఎస్‌యు) వీసీ డా.విజయభాస్కర్ ఇటీవల సందర్శించి విద్యావిషయాలపై అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం, ఆయన్ను ఆ కళాశాల వారు ఘనంగా సన్మానించారు. విద్యాదాత డా. దొడ్ల రామచంద్రారెడ్డి సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సుబ్రహ్మణ్యంనాయుడు, డా.ఆర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కంటి సమస్యలపై అవగాహన





పాఠశాల విద్యార్థులకు వస్తున్న కంటి సమస్యలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సంగంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణురాలు ఎం.శ్రీలేఖ పాల్గొని, పిల్లల్లో తరచూ వచ్చే హ్రస్వ దృష్టి, దీర్ఘదృష్టి, గ్లకోమా, కండ్లకలక వంటి వ్యాధులను ఉపాధ్యాయులు గుర్తించి తగు చికిత్సలు చేయించాలన్నారు. త్వరలోనే పాఠశాలలోని పిల్లలందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన చికిత్సలు, కంటి అద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు, మండల విద్యాశాఖ అధికారి జానకిరామ్, మల్లయ్యలతో పాటు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'జలజీవన్'ను సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ పథకం ద్వారా తాగునీటిని అందరికీ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విడవలూరు మండలం అలగానిపాడు గ్రామ సర్పంచ్ శేషయ్య గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. ఇటీవల జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల అభ్యున్నతికోసం చేపడుతున్న పలు పథకాలను వివరించారు. స్థానిక నాయకులు జనార్ధన్, లక్ష్మీనారాయణలతో పాటు పంచాయతి కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గొలగమూడిలో ఉచిత పశువైద్య శిబిరం



వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో పశుసంవర్ధక శాఖ, మండవ ఫౌండేషన్ వారు సంయుక్తంగా ఇటీవల ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గేదెలకు, ఆవులు, దూడలకు వైద్యపరీక్షలు చేశారు. దూడలకు నట్టల నివారణకు మందులు వేశారు. పాల దిగుబడిలో రైతులకు జాగ్రత్తలు సూచించారు. పశువులకు వ్యాధులు రాకుండా రైతులు ఎప్పటికప్పుడు టీకాలు వేయిస్తుండాలని చెప్పారు. పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు, మండవ ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులునాయుడు, గోపాలమిత్ర శ్రావణ్‌కుమార్, మనోజ్, సుధీర్, తాకిద్దీన్, సమద్ పాల్గొన్నారు.

### మంచినీళ్లూ లేవు.. మంచి వైద్యమూ లేదు...

# ఉదయగిరి సమస్యలపై గళమెత్తిన కాకర్ల



ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలోని సమస్యలపై గళమెత్తారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడి ఉందని, కనీస వైద్యానికి కూడా నోచుకోక అనేకమంది రోగగ్రస్తులుగా ఉన్నారని, సకాలంలో మంచి వైద్యం అందక మరి కొంతమంది ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. నియోజకవర్గంలోని ఉదయగిరి మరియు వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

క్లోరిన్ ప్రభావం వల్ల ఎంతోమంది క్లోరైడ్ బాధితులు ఉన్నారన్నారు. వారందరూ నెల్లూరు వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుచేత ఉదయగిరి, వింజమూరులలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు విన్నవించారు. హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సభాపతి ద్వారా అసెంబ్లీలో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మెట్టవాసులకు వైద్య ఖర్చులు తగ్గించి ఆరోగ్య భద్రత కల్పించాలని ఆయన కోరారు. ఎనిమిది మండలాల్లో ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని కొన్ని మారుమూల గ్రామాలకు మంచినీటి సౌకర్యం కూడా లేదన్నారు. గుక్కెడు మంచినీళ్ళ కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితున్నాయన్నారు. ఉదయగిరి ప్రాంతంలో విశాలవంతమైన భూభాగం ఉన్నప్పటికీ సాగునీరు లేక పంటపొలాలు బీడు భూములుగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తే వేలాది ఎకరాలు బంజరు భూములుగా మారతాయన్నారు.

# 'నాడు-నేడు' పనులపై సీబీఐ దృష్టి సారించాలి

### - విద్యార్థి సంఘాల డిమాండ్




గత ప్రభుత్వం అస్త వ్యస్తంగా చేపట్టిన 'నాడు-నేడు' పనులపై సీబీఐ దృష్టి సారించి విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల వారు డిమాండ్ చేశారు. నెల్లూరులోని కెవిఆర్ నగరపాలక పాఠశాలలో ఇటీవల గురుమహేంద్ర అనే విద్యార్థి మృతి చెందడం దారుణమంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వం అవినీతి మూలంగా నాడు-నేడు పనులు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆరోపించారు. కెవిఆర్ స్కూల్లో నాసిరకపు నిర్మాణాల వల్ల అక్కడున్న గోడ కూలిపోయి విద్యార్థి దుర్మరణం చెందడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి వెంటనే పాతిక లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు శివం వర్మ, ఆకాష్, జాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### సంగంలో...

# ఒకేరోజు 6 ఇళ్ళలో చోరీలు



మండల కేంద్రమైన సంగంలో దొంగలు జోరు పెరిగింది. తాళాలు వేసిన ఇళ్ళను గమనించి, తాళాలు పగలగొట్టి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల శివాజీ సెంటర్, కొత్తూరు, తిరమనతిప్ప ప్రాంతాల్లో చోరీలు చేసి అందినకాడకి దోచుకుపోయారు. ఒకేరాత్రి ఆరు ఇళ్ళలో దొంగతనాలు చేయడంతో సంగం ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఓ ఇంట్లో 60 వేల రూపాయలతో పాటు, బంగారువస్తువులు అపహరించారు. మరో ఇంట్లో ఉన్న 20వేల రూపాయలను దొంగిలించుకుపోయారు. మరికొన్ని ఇళ్లలో చోరీలు చేసినా ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. ఈ చోరీలు జరిగిన ఇళ్ళను సీఐ రవినాయక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి పరిశీలించారు. దొంగల ఆచూకీ తెలుసుకునేందుకు క్లూస్‌టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కొద్దిరోజుల కిందట కూడా ఇదే విధంగా ఒకేరాత్రి 5 ఇళ్ళల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. భారీస్థాయిలో సొత్తు దోచుకుపోయారు. పోలీసులు గాలిస్తున్నా ఇప్పటికీ ఎవరూ దొరకలేదు. జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, తాళాలు వేసివున్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్న ముఠాను పట్టుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## టూకీగా...



### పెంచలకోనలో కన్నులపండువగా..

### శ్రీ లక్ష్మీనృసింహుని కల్యాణం

రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో ఇటీవల స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తొలుత, అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. ఇఓ సాగర్‌బాబు పర్యవేక్షించారు.

### కావలిలో దివ్యాంగులకు ఉచిత వైద్యశిబిరం

కావలిలోని దివ్యాంగుల కాలనీలో ఇటీవల ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, దివ్యాంగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. సిద్ధనకొండూరు ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ టి.రోహిణి వారికి వైద్యసేవలందించారు. దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు మండవ వెంకటరావు, ఎంఎన్ఓ సుబ్బారెడ్డి, బాలల సంక్షేమాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

### పిడూరులో గ్రామసభ

మనుబోలు మండలం పిడూరు గ్రామంలో ఇటీవల గ్రామ సభ జరిగింది. ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాలని, మరుగుదొడ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం రూ.15వేలు మంజూరుచేస్తుందని, ఆ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి సర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి గ్రామస్తులకు చెప్పారు. విఆర్ఓ శీనమ్మ, ఏపిఏ అమూల్య, డిఏ నజీర్ పాల్గొన్నారు.

### ఆత్మకూరులో న్యాయవిజ్ఞాన సదస్సు

ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయంలో ఇటీవల మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు ఏర్పాటుచేశారు. సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ, డ్రైవింగ్‌లో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. మునిసిపల్ కమిషనర్ షేక్ ఫజలుల్లా పాల్గొన్నారు.

### ముత్తుకూరులో కూరగాయల సాగుపై అవగాహన

ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇటీవల ఉపాధ్యాయులు కూరగాయల సాగు పట్ల అవగాహన కలిగించారు. తోటల్లోకి వెళ్లి రైతులతో కలిసి మాట్లాడించారు. బీర, తోటకూర, పొట్ల, మునగ సాగులను పరిశీలించారు. ఉపాధ్యాయురాళ్ళు గిరిజ, మాధవి, సుమతి, రేఖారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

### అల్లూరులో వాహన తనిఖీలు చేసిన ఆర్టీఓ

మండల కేంద్రమైన అల్లూరులో ఆర్టీఓ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఇటీవల వాహన తనిఖీలు జరిగాయి. సరైన పత్రాలు లేని రెండు వాహనాలను సీజ్‌చేసి, జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపరాదని ఆయన వాహనదారులకు స్పష్టం చేశారు.

### శకునాలపల్లి పాఠశాల తనిఖీ


ఉదయగిరి మండల పరిధిలోని శకునాలపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇటీవల మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు డిజిటల్ విద్యా వనరుల వినియోగం పట్ల అవగాహన కలిగించాలన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మాలకొండ దేవాలయం ఆదాయం.. రూ7.83 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలంలో ఉన్న శ్రీ మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి జులై 27 శనివారం ఒక్కరోజునే రూ.7,83,556 ఆదాయం వచ్చినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

### కావలిలో ఎన్‌సిసి కేడెట్లకు రక్తం గ్రూపు నిర్ధారణ

కావలి పాతవూరులోని పురపాలక ఉన్నతపాఠశాలలో జులై 27న 80 మంది ఎన్‌సిసి కేడెట్లకు రెడ్‌క్రాస్ సొసైటీవారు రక్తం గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బారావు మాట్లాడుతూ, ఎన్‌సిసి కేడెట్లు భవిష్యత్తులో రక్తదాతలుగా మారి సమాజానికి సేవచేయాలన్నారు. ఎన్‌సిసి అధికారి మస్తాన్‌వలి, టెక్నీషియన్ పద్మావతి, శేషమ్మ పాల్గొన్నారు.



# భయపెడుతున్న 'నోరో వైరస్'

• 'తస్మాత్ జాగ్రత్త' అంటున్న వైద్య నిపుణులు

**వాతావరణ మార్పులతో ఎక్కడ చూసినా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏ ఆసుపత్రి చూసినా నానారకాల వైరస్ వ్యాధులతో జనం నిత్యం సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తాజాగా ప్రజలను బాధించేందుకు నోరో వైరస్ తయారైంది. ఎక్కడ మురుగు, అపరిశుభ్రత ఉంటే అక్కడంతా ఈ వైరస్ వ్యాపిస్తోంది.**

డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులతో పాటు ఇప్పుడు తాజాగా మరో వైరస్ 'నోరోవైరస్' జనాన్ని బెంబేలెత్తిస్తోంది. తెలంగాణ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఈ వ్యాధి బాగా విస్తరిస్తోందని, ఒక్క పాతబస్తీలోనే రోజూ వందల సంఖ్యలో ఈ కేసులు వస్తున్నాయని, ఏ ప్రాంతంలో ఎప్పుడు ఈ వైరస్ వీరంగం చేస్తుందో తెలియదు కనుక, అన్ని ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అపరిశుభ్రత ఉన్నచోట ఈ వైరస్ వ్యాధి ముప్పు ఉంటుందని, దీని బారినపడకుండా ముందుజాగ్రత్తలే శ్రీరామరక్ష అని అంటున్నారు.

## వ్యాధి లక్షణాలు

ఈ నోరో వైరస్‌ను 'వింటర్ వామ్టింగ్ బగ్' అని కూడా పిలుస్తారు. ఎక్కువగా వానాకాలంలో ఈ వైరస్ విపరీతంగా వస్తుంటుంది. అంటువ్యాధిలా ఒకరినుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. ప్రధానంగా అపరిశుభ్రత వల్లే వస్తుంటుంది. కలుషితమైన నీళ్లు తాగడం, నాణ్యత లేని ఆహారం తినడం వల్ల ఈ వైరస్ వ్యాధి వస్తోందని వైద్యులు చెప్తున్నారు. ఈ వైరస్ సోకినవారికి చలి, జ్వరం, వాంతులు–విరేచనాలు, నీరసంగా ఉండడడం, కడుపునొప్పి వగైరా లక్షణాలు ఉంటాయని, అలాంటి సమస్యలేమైనా ఉంటే వారు వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్సలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

## వైరస్ ఎక్కువైతే ప్రమాదం

ఇన్‌ఫెక్షన్ ఎక్కువైతే ఆరోగ్యం దెబ్బతిని, శరీరంలోని అనేక అవయవాలపై దీని ప్రభావం పడుతుందని, మూత్రపిండాలు పాడైపోయే ప్రమాదం కూడా ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. మధుమేహవ్యాధి (షుగర్)గ్రస్తులు ఈ వైరస్ బారిన పడకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని  సూచిస్తున్నారు. ఈ వ్యాధి రాకుండా ఉండేందుకు ఎలాంటి టీకా అందుబాటులో లేదని, ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగు చికిత్సలు చేయించుకుంటే కేవలం రెండు మూడురోజుల్లోనే తగ్గుతుందని చెప్తున్నారు. తరచూ చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవడం, కాచి చల్లార్చి వడపోసిన నీళ్ళను తాగడం మంచిదని, అదేవిధంగా మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్తున్నారు. వేడి ఆహారం, శుభ్రమైన ఆహారపదార్థాలను తినడం ముఖ్యమని హెచ్చరిస్తున్నారు. వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగించుకోవాలని, తద్వారా ఆ వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండేందుకు ఎవరికి వారు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

# డీఎస్పీలకు స్థానచలనం

జిల్లాలో పలువురు డిఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు గ్రామీణ నియోజకవర్గానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసి పోలీసు కార్యాలయానికి అటాచ్ అయిన పి.వీరాంజనేయరెడ్డిని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులును పెనుకొండ ఎస్‌డీపీవోగా, సీసీఎస్ డీఎస్పీ పి.రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎస్పీ అత్తిన శ్రీనివాసరావు నెల్లూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా రానున్నారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ సీహెచ్ విజయభాస్కర్‌రావును పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సీఐల బదిలీలు...

జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీచేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మహిళా పోలీస్‌స్టేషన్–2లో ఉన్న అజయ్ కుమార్‌ను ఒంగోలు పోలీస్‌స్టేషన్‌కు, వేదాయపాళెం సీఐ పీ.నారాయణను కలిగిరి సర్కిల్‌కి, కలిగిరి సీఐ ఎం.డి ఫిరోజ్‌ను రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. చిన్నబజారు ఇన్స్‌పెక్టర్ కె.అశోక్‌కుమార్‌ను  రేంజ్ విఆర్‌కు,  సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావును చిన్నబజారు పీఎస్‌కు, సీసీఎస్ ఒంగోలు ఇన్స్‌పెక్టర్ టి.విజయ్‌కృష్ణను రాపూరు సర్కిల్‌కు, రేంజ్ విఆర్‌లో ఉన్న సుబ్బారావును వెంకటాచలసత్రం సర్కిల్‌కు బదిలీ చేశారు.

# దేవుళ్ల నెత్తినే శఠగోపం పెట్టేశారు

• కోట్ల రూపాయలను బొక్కేశారు

• జిల్లాలో 5గురు ఈఓలు సస్పెండ్

***దేవాదాయశాఖలో అవినీతి అధికారులు రాజ్యమేలుతున్నారనడానికి తాజాగా జిల్లాలో ఒకరు కాదు, ఇద్దరు కాదు..ఏకంగా అయిదుమంది కార్యనిర్వహణాధికారులు సస్పెండ్ కావడమే ఓ పెద్ద నిదర్శనం. ఆలయాల కార్య నిర్వహణాధికారులంటే దేవుడి డబ్బుకు కాపలాదారులు. అనునిత్యం ఆ భగవంతుని సేవలో తరించే భక్తపరాయణులు. అయితే, కాలం మారిపోయింది. అనేక దేవాలయాల్లో అధికారులే దేవుడి డబ్బును అప్పనంగా కాజేస్తున్నారు. దేవుడు చూడడం లేదు కదా అని అందినకాడకి దోచుకునేస్తున్నారు. అయితే, అక్రమాలు పెరిగిపోయినప్పుడు దేవుడు కళ్లు తెరుస్తాడనే నిజాన్ని ఆ అవినీతిపరులు గ్రహించలేకపోతున్నారు. 'సస్పెండ్ చేస్తే ఏమవుతుంది.. మళ్ళీ వచ్చేస్తాంలే'.. అనే ధీమా కూడా అవినీతి అధికారుల్లో ఉందని, ఆమేరకు వాళ్ళు లోలోపలే ప్రయత్నాలు చేస్తున్నారని భోగట్టా!...***

దేవాలయల్లో జరుగుతున్న స్వాహా కార్యక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం కొరడా ఝుళిపిస్తున్నారు. గత ప్రభుత్వంలో గాదెకింద పందికొక్కుల్లా దేవుడి డబ్బును మెక్కేస్తున్న అవినీతి జలగలను ఏరిపారేసేందుకు కొత్త ప్రభుత్వం కంకణం కట్టుకోవడంతో, ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అధికారులు, నిర్వాహకుల్లో వణుకు పుడుతోంది. అక్రమార్కుల గుండెల్లో గంటలు మోగుతున్నాయి. అసలు దేవాలయాల్లో ఏం జరుగుతోంది..అందులోనూ తన సొంతజిల్లా అయిన నెల్లూరు జిల్లాలో ఉన్న ఆలయాల్లో దేవుడి డబ్బును ఎవరెవరు మింగేస్తున్నారో ఆరా తీసిన మంత్రి ఆనం ఆ వ్యవహారాలపై లోతైన విచారణ జరిపించినట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ కూడా ఆలయాల్లో జరుగుతున్న అక్రమాలపై మంత్రికి ఫిర్యాదుచేసినట్లు సమాచారం. దీంతో, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి ఆలయాల్లో అన్నీ తామే అయి విధులు నిర్వహించే కార్యనిర్వహణాధికారులే (ఇ.ఓలు) దేవుళ్ళ నెత్తిపై శఠగోపం పెడుతున్నారని, వాళ్ళకే పంగ నామాలు పెట్టేసి పెద్దమొత్తాల్లో జవురుకుంటున్నారని తేల్చారు.

## జొన్నవాడ దేవాలయంలో.. రూ. కోట్లు కాజేశారు

జిల్లాలో ఎంతో మహిమాన్వితమైన, శక్తిస్వరూపిణి జొన్నవాడ కామాక్షమ్మ డబ్బును కూడా దిగమింగేందుకు అధికారులు సిద్ధమయ్యారంటే ఏమనుకోవాలి?..జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఆలయమిది. లక్షలాదిమంది భక్తులు అమ్మవారి కరుణాకటాక్షాల కోసం ఎంతెంతో దూరప్రాంతాల నుంచి శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దర్శనానికి ఎంతో భక్తిశ్రద్ధలతో వస్తుంటారు. ఆలయంలో ఎదురుగా కూర్చుని, అమ్మవారిని చూస్తూనే, ఆలయం డబ్బును చాటుగా మూటలు కట్టుకునేందుకు కూడా సిద్ధమైన ఆలయ అధికారుల వ్యవహారాన్నంతా ఉన్నతాధికారులు పరిశీలించారు. సుమారు కొన్ని కోట్ల రూపాయల దాకా గోల్మాల్ జరిగినట్లు గగ్గోలుగా ఉన్న జొన్నవాడ దేవాలయంలో, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, ఆ డబ్బు స్వాహాకి సంబంధించి దేవస్థానం సహాయ కమిషనర్‌గా, కార్యనిర్వహణాధికారులుగా పనిచేసిన డి.వెంకటేశ్వర్లు, వి.గిరికృష్ణలను సస్పెండ్ చేస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో జొన్నవాడ దేవాలయంలో కలకలం రేగుతోంది. ఎట్టకేలకు, అవినీతి అధికారుల బండారం బయటపడడంతో భక్తులు సంతోషపడుతున్నారు. అయితే, దేవుడి డబ్బును తినేశారని నిర్ధారిస్తే అలాంటివారిని సస్పెండ్ చేయడమే కాక, వారి నుంచి ఆ డబ్బునంతా అణాపైసలతో సహా రాబట్టాలని, దేవుడినే కొల్లగొట్టాలనుకుంటే ఏమవుతుందో తెలిసేలా వారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు కూడా తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## మరో ముగ్గురు కూడా

దేవాదాయశాఖలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఆలయ పునర్నిర్మాణం వ్యవహారంలో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారనే కారణంతో వింజమూరు మండలం నల్లగొండ్ల లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గతంలో విధులు నిర్వహించి, ఇప్పుడు నెల్లూరులోని గ్రామశక్తి శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఇఓగా ఉన్న బి.మల్లికార్జునరెడ్డిపై సస్పెన్షన్ వేటుపడింది. అదేవిధంగా, కందుకూరు నియోజకవర్గం లోని ఉలవపాడు పరిధిలో ఉన్న శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో గతంలో ఇఓగా పనిచేసిన జానకిని, ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్న ఇఓ కె.పెంచలవరప్రసాద్‌ని కూడా ఆలయాల్లో చేసిన అవకతవకలపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇంకా, జిల్లాలో ఎక్కడెక్కడ ఏ దేవాలయాల్లో అవినీతి అధికారులు చేరి, ఎంతెంత మెక్కారో కొత్త ప్రభుత్వం ఆరా తీస్తుండడంతో దేవుళ్ళ డబ్బును తినేసిన అధికారులకు వణుకు పుడుతోంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com